
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024



5




8 ఊర పిచ్చుక.. ఊసేదీ..?

● సెల్ ఫోన్ కాలుష్యంతో మాయమైన ఆత్మ బంధువులు



గుంటూరు అమరావతి రోడ్డులో మద్యం దుకాణం ప్రారంభానికి ఏర్పాట్లు చేసుకుంటున్న నిర్వాహకులు

మా వాళ్లకి వాటా ఇవ్వాల్సిందే



- స్టాక్‌పై డిపోల్లో కొనసాగుతున్న గందరగోళం
- చాలా ప్రాంతాల్లో ప్రారంభంకాని దుకాణాలు
- మద్యం ధరలు యథావిధిగానే.. అమల్లోకి రాని కొత్త ధరలు

మద్యం లైసెన్సీలపై రాజకీయ ఒత్తిళ్లు

ప్రభుత్వ మద్యం.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వచ్చేసింది. అదృష్టంతో దక్కించుకున్న వారు ఆనందంతో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునే హడావుడిలో ఉండగా వారికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసిన వారికి.. నేతల అండ ఉన్నా వారికి.. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారిలో చాలామందికి లాటరీలో దుకాణాలు దక్కలేదు. దీంతో వీరంతా దుకాణాలు దక్కించుకున్న వారిపై కన్నేశారు. తమకు వాటా ఇవ్వాలని.. తమ వారిని భాగస్వాములుగా చేర్చుకోవాలనే డిమాండ్లతో పలువురు ఒత్తిళ్లు తెస్తున్నారు. తాము చెప్పినట్లు చేయకపోతే తమ ప్రాంతంలో వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామనే హెచ్చరికలు.. బెదిరింపులు కూడా లైసెన్సీలకు వస్తున్నాయి. మరోవైపు తమ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దని స్థానికుల నుంచి నిరసనలు వస్తున్నాయి. ఇక మద్యం ధర తగ్గకపోవడంతో మందుబాబులు నిరాశలో ఉండగా.. స్టాకుపై సాంకేతిక అవాంతరాలతో దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి దుకాణాలు ప్రారంభానికి నోచుకోలేదు.



గుంటూరు పట్టాభిపురంలో మద్యం దుకాణం వద్ద మందుబాబులు

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కోసం లాటరీ ప్రక్రియ ముగిసింది. తొలి వాయిదా లైసెన్సు ఫీజును లాటరీ విజేతలు చెల్లించేశారు. స్టాక్ కోసం డిపోల్లో ఇండెంట్ పెట్టి షాపు ప్రారంభించుకోవడానికి లైసెన్సీదారులు సిద్ధపడుతున్నారు. అయితే తొలి నుంచి మద్యం వ్యాపారం చేజిక్కించుకోవాలని.. దుకాణాలను దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించిన నేతలు, వారి అనుచరులు టీడీపీ అధిష్ఠానం హెచ్చరికలతో వెనక్కితగ్గారు. అయితే వీరు తిరిగి ఎలాగైనా మద్యం వ్యాపారంపై పట్టు సాధించాలని లైసెన్సీదారులపై ఎవరిస్థాయిలో వారు ఒత్తిళ్లు తెస్తున్నారు. కొన్ని చోట్ల నేతల అండతో వారి అనుచరగణం భాగస్వామ్యం దక్కించుకోవడానికి పట్టు వీడడం లేదు. తమను కాదని వ్యాపారం చేసే పరిస్థితి ఉండదని, కొంతమందిని భాగస్వాములుగా చేర్చుకోమని లైసెన్సుదారులకు ఫోన్ చేసి మరీ బేరసారాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. లైసెన్సు పొందిన వారిలో చాలామంది అంతకు ముందు నలుగురు నుంచి పది మంది వరకు కలిసి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇప్పుడు వారిలో ఒక్కరికి తగిలినా సరే ఆ షాపులో వారంతా భాగస్వాములుగానే ఉండి నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎక్కువగా భాగస్వాములు ఉంటే ఇప్పుడు నేతలు చెప్పిన వారిని చేర్చుకుంటే తమకు మిగిలేది ఏముంటుందనే భావనను వారు వ్యక్తపరుస్తున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న స్థానికేతరులను పిలిచి తాము సూచించిన వారిని వ్యాపారంలో భాగస్వాములు చేసుకోవాలనే ఒత్తిడికి నేతలు తెరలేపినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం అంత సులువైన విషయం కాదు. అధికార పార్టీ కాబట్టి వారి ఆదేశాలను ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులు తూచా తప్పకుండా పాటిస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం సాహసంతో కూడుకున్న పనిగా వ్యాపారులు భావిస్తున్నారు. నేతల ఒత్తిడి ఎక్కువ అవడంతో ఏం చేయాలో తోచక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. నేతల మాట కాదని ముందుకెళ్తే ఎన్నో ఇబ్బందులు పడతాం.. ఆ విధంగా వెళ్లడం కూడా కరెక్ట్ కాదని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఇక మద్యం సరఫరాలో డిపోల వద్ద గందరగోళం నెలకొంది. బాపట్ల జిల్లాలో 117 షాపులు బుధవారం ప్రారంభం కావాల్సి ఉండగా అన్నీ కలిపి 53 దుకాణాల్లో మాత్రమే తొలిరోజు అమ్మకాలు జరిగాయి. మద్యం స్టాక్ విషయంలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపుల వారు తెనాలి డిపో నుంచి, అద్దంకి, పర్చూరు, చీరాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపులకు ఒంగోలు డిపో నుంచి స్టాక్ తెచ్చుకోవాల్సి ఉంది. అయితే స్టాక్ విషయంలో సదరు డిపోల్లో స్పష్టత లేకపోవడంతో ఇండెంట్ కోసం వెళ్లిన లైసెన్సుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 129 షాపులకు 75 షాపులకు మాత్రమే బుధవారం డిపోల నుంచి మద్యం సరఫరా జరిగింది. మద్యం నిల్వలకు డబ్బు చెల్లించిన వారికి డిపోల నుంచి మద్యం సరఫరా చేయలేకపోయారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కూడా నెలకొంది. మరికొందరు దుకాణాల ఏర్పాట్లలో ఉన్నారు. గురువారానికి నూతన పాలసీ ప్రకారం మద్యం దుకాణాలు తెరుచుకునే అవకాశం ఉండవచ్చు.

చీరాలలో యువనేత అత్యుత్సాహం..

చీరాల నియోజకవర్గంలో ఉన్న 20 షాపులకు 7 షాపుల వరకు వైసీపీ సానుభూతిపరులు దక్కించుకున్నారు. మరో 5 షాపులను ఎన్నికలకు ముందే జాతీయ పార్టీ తీర్థం పుచ్చుకున్న సదరు నేత అనుచరగణం చేజిక్కించుకుంది. దీంతో మద్యం షాపుల విషయంలో అధికారపార్టీకి చెందిన ఓ యువనేత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఏకంగా లైసెన్సుదారులకు ఫోన్ చేసి వాటా సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. తమ కనుసన్నల్లోనే వ్యాపారం జరగాలనే హుకుం జారీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రేపల్లెతో పాటు బాపట్లలో రెండు షాపుల విషయంలో బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం. లాటరీకి ముందు సిండికేట్ పర్వం ఒక ఎత్తయితే రూరల్ మండలాల పరిధిలో షాపులు దక్కించుకున్న వారంతా కలిసి రింగ్ అవుతున్నట్లు తెలుస్తోంది. లొకేషన్ విషయంతో పాటు ఇతరాత్ర వాటిలో తమలో తాము విభేదాలకు దిగితే నష్టపోతామనే అంచనాకు వచ్చిన వ్యాపారులు మధ్యేమార్గంగా షాపులన్నీ కలిసి రింగ్ అయి లాభాన్ని పంచుకోవాలనే అవగాహనకు వస్తున్నట్లు సమాచారం.

ఈ నెల 30 వరకు ఎక్కడైనా....

మద్యం షాపు లెసెన్సు పొందిన వారు ఈ నెల 30 వరకు తాత్కాలిక ప్రాతిపదికన, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎక్కడైనా అమ్ముకోవచ్చని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. లక్షలు పెట్టి షాపు దక్కించుకున్న వారు నష్టపోకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే 30వ తేదీ తర్వాత మాత్రం శాశ్వత షాపులోనే వ్యాపారం చేయాలని ఇందులో ఎటువంటి మినహాయింపు ఉండదని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచే ప్రభుత్వ మద్యం షాపులు మూసివేసి ఉండడంతో మద్యం కోసం మందుబాబులు గంటల తరబడి వేచి ఉన్నారు. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రైవేటు మద్యం షాపులు బుధవారం ఉదయం నుంచి అందుబాటులోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ ప్రకటించినా మధ్యాహ్నానికి కొన్ని షాపులు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి గురువారం నాటికి తెరుచుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఉన్న స్టాక్‌తో పాటు ఫర్నిచర్‌ను రెవెన్యూ విభాగం సమక్షంలో లెక్కకట్టి వాటిని డిపోలకు తరలించే ప్రక్రియను ఎక్సైజ్ శాఖ చేపట్టింది.

మందుబాబులకు షాక్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రకారం ప్రైవేట్ మద్యం దుకాణాలు కొన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. అయితే మందుబాబులు నిరాశకు గురయ్యారు. తక్కువ ధరకు, నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూస్తున్న మందుబాబులు బుధవారం ప్రారంభమైన దుకాణాల్లో మద్యం ధరలు చూసి షాక్‌కు గురయ్యారు. ఆశగా మద్యం షాపులకు వెళ్లిన మందుబాబులు అక్కడి ధరలు చూసి ఖంగుతిన్నారు. నిన్నటి వరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో విక్రయించిన ధరలకే ప్రైవేట్ మద్యం షాపుల్లో కూడా విక్రయాలు జరిపారు. ప్రభుత్వం చెప్పినట్టుగా రూ.99 క్వార్టర్ మద్యం ప్రైవేట్ షాపుల్లో అందుబాటులోకి ఇంకా రాలేదు. పాత ధరలే అమలు కావడంతో మందు బాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎక్సైజ్ ఈఎస్ మణికంఠను వివరణ కోరగా కొత్త ఎమ్మార్పీ ఇంకా రాలేదని, అది మారే వరకు పాత ధర లకే మద్యం విక్రయాలు జరుగుతాయన్నారు.

నష్టపోయారు.. న్యాయం చేయాలి

మా కార్యకర్తలకు మీ షాపులో 25 పైసలు వాటా ఇవ్వాల్సిందేనని స్థానిక నేతలు మద్యం వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మా కార్యకర్తలు నష్టపోయి ఉన్నారు. వారికి కూడా మేము న్యాయం చేయాలి. మీకు రావాల్సిన వాటా ప్రకారం వారు చెల్లిస్తారు. లైసెన్సు ఫీజులో కూడా వాటా ప్రకారం చెల్లిస్తారు. మీరు కూడా మా వారితో సహకరించండి. మీకు అన్ని విధాలుగా ఉపయోగం ఉంటుందంటూ చాలా చోట్ల నేతలు లైసెన్స్‌దారులతో బేరసారాలు మాట్లాడుకుంటున్నారు. అయితే పది పైసలు వాటా మాత్రం ఇవ్వగలమని కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. కుదరదు మావారికి 25 పైసలు వాటా ఇవ్వాల్సిన అంటూ కొందరు నేతలు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో మద్యం వ్యాపారులు నేతల పక్కన ఉండే ద్వితీయ శ్రేణి నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

షాపుల ఏర్పాటుపై నిరసనలు

మద్యం షాపుల ఏర్పాటు హడావుడిలో నిర్వాహకులు ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు నగరం నందివెలుగు రోడ్డులోని మణి హోటల్ సెంటర్లో మహిళలు తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దంటూ నిరసన చేపట్టారు. బుధవారం రోడ్డుపై టెంటేసి ఆందోళన చేపట్టారు. కాకానిరోడ్డులోని ఉదయ్ హాస్పిటల్ ఎదుట మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు, ఈఎస్ ఏ అరుణ కుమారిలకు ఫిర్యాదు చేశారు. వివాదాస్పద స్థలంలో హాస్పిటల్ కు మధ్యలో ఏ విధంగా మద్య షాపు ఏర్పాటు చేస్తారని, తక్షణమే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాల ఏర్పాట్లను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఊరుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుపై స్థానికుల నుంచి నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



గుంటూరు మణిహోటల్ సెంటర్లో ఆందోళన చేస్తున్న మహిళలు.

పల్లె ప్రగతికి..
ఇసుక గండం

- పట్టణాల్లో అభివృద్ధికి ఆటంకం
- వెంటాడుతున్న కొరత
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న అభివృద్ధి పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెల ప్రగతిపై ఇసుక ప్రభావం పడింది. ఇసుక కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పంచాయతీలు, మున్సిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక దొరకక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఇప్పట్లో ఇసుక కొరత తీరే పరిస్థితులు కని పించడంలేదు. ఇక ప్రైవేట్ నిర్మాణదారులు కూడా పనులను నిలిపేసుకుంటున్నారు. ఇసుక సమస్య కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతోంది. బ్లాక్‌లో టన్ను ఇసుక రూ 1,700 నుంచి రూ 1,800లకు కొనుగోలు చేయాల్సి ఉండటంతో ఇటు కాంట్రాక్టర్లు.. అటు నిర్మాణదారులు పనులు నిలుపుదల చేస్తున్నారు.

ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. పెద్దఎత్తున ప్రగతి పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గోకులాలు ఇలా అనేక పనులను వారోత్సవాల్లో భాగంగా ప్రారంభిస్తున్నారు. ఒక ఉద్యమంలా ప్రగతి పనులను చేపడుతున్నారు. 1386 పనులకు రూ 157.19 కోట్లు వ్యయం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో రూ. 14.35 కోట్ల వ్యయంతో 166 పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శంకుస్థాపనలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలో పల్లెల్లో రూ 70.84 కోట్ల వ్యయంతో 620 పనులు చేపడుతున్నారు. బాపట్ల జిల్లాలో రూ 72 కోట్ల వ్యయంతో 600 పనులు చేపడుతున్నారు. ఈ పనుల్లో అత్యధికంగా సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనులు ఉన్నాయి. పనులను శంకుస్థాపనలు చేసి ప్రారంభిస్తున్నా వీటిని చేపట్టే పరిస్థితులు కానరావడంలేదు. ఇసుక కొరత వెంటాడుతుండటంతో ఆయా పనులు నిలిచిపోనున్నాయి. పల్లెలతో పాటు మునిసిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇసుక సకాలంలో లభిస్తుండకపోతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. అర్ధాంతరంగా పనులు నిలిచిపోతుండటంతో పురాల పౌరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక పుష్కలంగా సరఫరా చేస్తేనే మళ్ళీ ప్రగతి పనులు పట్టాలెక్కే పరిస్థితి ఉంది.

పల్నాడు జిల్లాలో ఇసుక నిల్వలు నిండుకుంటున్నాయి. జిల్లా మొత్తం మీద ఒక్క మాదిపాడు యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ కూడా 9 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. ఈ యార్డు నుంచి రోజుకు 50 లారీల లోపే లోడింగ్ చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌కు సరఫరాకు అసలు పొంతన లేదు. ఆరు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మైనింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇసుకని తోడేందుకు బిడ్‌లు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన బిడ్‌లను బుధవారం సాయంత్రం వరకు ఆమోదించలేదు. కృష్ణానదికి మళ్లీ వరద వచ్చింది. సాగర్ డ్యాం నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపే పరిస్థితి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు వారం రోజులు మించి వచ్చే పరిస్థితి లేదు. ఇసుక రీచ్‌లలో గత వారం రోజుల క్రితమే తవ్వకాలు జరిపి ఉంటే ఇసుక కొరత కొంత తీరేది. ఈ దిశగా సంబంధిత యంత్రాంగం స్పందించలేదన్న విమర్శలున్నాయి. ఇసుకకు గడ్డుకాలం నెలకొందన్న అభిప్రాయం నిర్మాణదారుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పనులు కూడా ఇప్పట్లో చేపట్టే పరిస్థితి లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి కుంటుపడటంతో పాటు కార్మికుల ఉపాధి కూడా ప్రమాదకర పరిస్థితిలో పడింది. ముందస్తు చర్యలు లేని కారణంగా ఈ పరిస్థితి దాపురించిందన్న వాదన వినిపిస్తోంది. గుంటూరు, బాపట్ల జిల్లాకు సంబంధించి కూడా ఇసుక తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు.



మాదిపాడు యార్డులో ఇసుక లోడింగ్

రౌడీషీటర్‌కు రాచమర్యాదలా

❑ పోలీసులపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం ❑ నల్లపాడు స్టేషన్‌లో బోరుగడ్డ అనిల్ విచారణ



నల్లపాడు స్టేషన్ వద్ద గుమికూడిన టీడీపీ శ్రేణులు

గుంటూరు, అక్టోబరు 16: వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగేతర శక్తిగా ప్రభుత్వ వ్యవస్థలన్నీ తన గుప్పెట్లో ఉన్నాయన్నట్లుగా అత్యంత హేయమైన భాషలో సోషల్ మీడియాలో చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి బంధువునని చెప్పుకుంటూ ఆయనపై ఎవరు ఆరోపణలు, విమర్శలు చేసిన వెంటనే సోషల్ మీడియాలో దారుణమైన, అత్యంత హేయమైన భాషలో దూషిస్తూ హెచ్చరికలతో గడచిన ఐదేళ్ల అరాచకాలకు తెగబడిన బోరుగడ్డ అనిల్‌ను నల్లపాడు పోలీసులు విచారిస్తున్నారు. అయితే రౌడీషీటర్ అయిన బోరుగడ్డ అనిల్‌కు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారంటూ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసి బుధవారం రాత్రి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నాయి. దీంతో నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యాంగా చెలరేగి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌తో పాటు ప్రతిపక్ష నాయకులను, వారి కుటుంబసభ్యులను, మహిళలను అసభ్య పదజాలంతో, వ్యక్తిగతంగా దూషిస్తూ, బెదిరిస్తూ అరాచకానికి పాల్పడిన అనిల్‌ను స్టేషన్‌కు తరలించి సీఐ వీరేంద్రబాబు విచారిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, రావిపాటి సాయి కృష్ణ, పులివర్తి అజార్, బోరుగడ్డ వెంకట్రావు, పోలినేని మధు, రఘురాం, పసి, మంచోడు మణిలతోపాటు పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు నల్లపాడు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసుల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. అరగంటలో చంద్రబాబును లేపేస్తానని, పవన్ కల్యాణ్ ఇంటి బెడ్ రూమ్‌లో దూరతానని అసభ్యకరంగా మాట్లాడిన అనిల్‌కు రాచమర్యాదలు చేస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి నల్లపాడు స్టేషన్‌కు చేరుకున్నారు. పార్టీ కార్యకర్తలను సముదాయించి వెళ్లి పోవాల్సిందిగా సూచించారు. ఐదేళ్ల రాష్ట్రంలో అరాచకం సృష్టించిన అనిల్‌ను అరెస్టు చేయడానికి ఐదు నెలల సమయం పట్టిందని, చివరకు ఆయన ఇంటికి వచ్చిన తర్వాత మాత్రమే అరెస్టు చేయగలిగారని పార్టీ కార్యకర్తలు పోలీసుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

మూడు కేసుల్లో పోలీసులకు చిక్కకుండా పరార్

పత్రికల్లో రాయలేని విధంగా, నోటితో చెప్పలేని విధంగా బోరుగడ్డ అనిల్ సోషల్ మీడియా వేదికగా చేసిన దోషణలు హెచ్చరికలపై అప్పట్లోనే మూడు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. తుళ్లూరు, అరండల్ పేట, పట్టాభిపురం పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనిల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో కొద్ది రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉన్న అనిల్, ఆ తర్వాత ప్రభుత్వ వైఖరి స్పష్టం కావడంతో మళ్లీ రెచ్చిపోయాడు. రెండు, మూడు దఫాలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం పైనా, కూటమి నేతలపైనా దూషణలు కొనసాగించాడు. పరారైన ఆయన కొంతకాలం హైదరాబాద్ బెంగుళూరు ప్రాంతాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి పట్టుకున్నందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత సైలెంట్ అయిపోయారు. ఈ క్రమంలో అతడు గుంటూరు అమరావతి రోడ్డులోని వేళాంగణినగర్‌లోని ఇంటికి రాగా బుధవారం పట్టాభిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి

వైద్య ఆరోగ్యశాఖాధికారులకు కలెక్టర్ ఆదేశాలు


గుంటూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి వైద్యఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్షా కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో గత ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జరిగిన ఐదు మాతృ మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పరిరక్షణ, సుఖ ప్రసవానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి సమీపంలోని జిల్లా ఆస్పత్రికి ట్యాగ్ చేసి ప్రసవానికి ముందుగానే ఆస్పత్రికి తరలించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ ఎం.మజీదాబి, డీఐవో లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ ఫలితాలు సాధించేలా చూడాలి

వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్దేశించిన ఫలితాలు సాధించేలా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అందరికీ జీవితకాల అభ్యాసనం, అవగాహన(ఉల్లాస్) జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన కుటుంబ సంక్షేమం తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య లక్ష్యాలన్నారు. ఎంపీడీవో అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో రెండు రోజుల్లోపు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా, మండల స్థాయి శిక్షణలు పూర్తి చేసి నవంబరు 5 నుంచి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరక్టర్ జగన్మోహనరావు, డీఆర్డీఏ డీపీఎం మురళి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ఉమాదేవి, డీపీవో సాయికుమార్, డీఈవో శైలజ పాల్గొన్నారు.

శివ.. శివ.. ఆలయంలో అపచారం!


● పెదకాకానిలో ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా పూజలు



పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం

6

సాగర్ ప్రాజెక్ట్ 8 క్రస్ట్ గేట్లు ఎత్తివేత



6

నేటి నుంచి '108' వాహనాలు జీజీహెచ్‌కి అనుసంధానం

6

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ పాఠాలు

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా..

సబ్జెక్టుల వారీగా రీసోర్సుపర్సన్లతో బోధన



8

నేడు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ జోషి రాక

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ మనోజ్ జోషి గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఆయన బుధవారం సాయంత్రమే ఢిల్లీ నుంచి విజయవాడకు చేరుకొని అక్కడే బస చేశారు. గురువారం ఉదయం తొలుత ఆయన రెవెన్యూ మంత్రితో సమావేశం అవుతారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో భేటి అవుతారు. అనంతరం 11 గంటలకు జిల్లాలోని దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో భూముల రీ-సర్వే వర్క్‌పై సమీక్ష నిర్వహిస్తారు. రాత్రికి విజయవాడలో ఉండి శుక్రవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రెంటచింతల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పాలువాయి జంక్షన్ దాటిన తరువాత జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. పాలువాయిగేట్ గ్రామానికి చెందిన జవిశెట్టి శ్రీను(37) బుధవారం పాలువాయి జంక్షన్‌కు వచ్చారు. పనులు పూర్తైన అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడు శ్రీనుకు ఎకరన్నర సొంత పొలం ఉండగా, మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పైర్లను సాగు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,250 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 39,822 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3,572 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

శివ.. శివ.. ఆలయంలో అపచారం!

- ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా పూజలు
- అసిస్టెంట్లచే అభిషేకాలు చేయిస్తున్న అర్చకులు
- భక్తుల ఫిర్యాదుతో మెమోలు జారీ చేసిన ఈవో


పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం

పెదకాకాని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధిలో పూజారులు అపచారానికి పాల్పడుతున్నారు. ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వేదాలు చదివిన వారు పూజలు, అభిషేకాలు చేయకుండా వారి కింద అనధికారకంగా పెట్టుకున్న అసిస్టెంట్లచే పూజలు చేయిస్తున్నారు. దీనిపై పెదకాకానికి చెందిన పెండ్యాల నాగ సురేష్ అనే భక్తుడు నేరుగా ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వెంటనే పూజారుల వివరణ కోరుతూ వారందరికీ మెమోలు జారీ చేశారు.

ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా..

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆగమన శాస్త్రానికి విరుద్ధంగా ఆలయ పూజారులు పూజలు నిర్వహిస్తున్నారు. వేదాలు పటించి, కష్టపడి నేర్చుకున్న మంత్రాలను, పూజా విధానాన్ని విస్మరించి వారి కింద అనధికారికంగా నియమించుకున్న అసిస్టెంట్ల చేత పూజలు చేస్తున్నారు. దీంతో అసలు పూజారులు విధులకు డుమ్మా కొడుతున్నారు. దేవస్థానంలో ఎంతో పవిత్రమైన పూజారి వృత్తిని పక్కనపెట్టి అనేక మంది పూజారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయంలో నిబంధనల ప్రకారం పని చేయాలి. వేదాలు చదవాలి, భక్తులకు కావాల్సిన పూజలు జరిపించాలి. వీటికి ఆలయ పూజారులు పూర్తిగా స్వస్తి పలికారు. మనల్ని అడిగేవాడు ఎవరన్నట్టుగా విధులకు హాజరు కాకుండా వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్క పూజారికి నెలకు రూ.70 వేల నుంచి రూ. 80 వేలు వరకు జీతాలు దేవస్థానం నుంచి చెల్లిస్తున్నారు. వీరంతా కూడా విధులకు హాజరు కాకుండా వారి కింద అనధికారికంగా పెట్టుకున్న అసిస్టెంట్ల చేత ప్రధాన ఆలయంలో, గర్భాలయంలో పూజలు జరిపిస్తున్నారు.

రెండు వర్గాలుగా విడిపోయిన పూజారులు

దేవస్థానం పూజారులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇటీవల ఒక వర్గంపై మరో వర్గం ఆధిపత్యం సాధించాలని వ్యూహ ప్రతి వ్యూహాలను వేస్తున్నారు. దీంతో పూజలకు డుమ్మా కొట్టడం, అభిషేకాలకు హాజరు కాకపోవడం పరిపాటిగా మారింది. ఇంతకుముందు ప్రతిరోజూ ఆలయంలో నిత్య కల్యాణాన్ని జరిపించారు. ఇప్పుడు నిత్య కల్యాణానికి మంగళం పలికారు. అర్చకుల మధ్య నెలకొన్న వర్గపోరుతో దేవస్థానానికి చెందిన పవన్ కుమార్ అనే అర్చకుడు లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. పూజారులు ఒక వర్గంపై మరొక వర్గం ఆరోపణలు చేసుకుంటూ ఆలయ పరువు, ప్రతిష్ఠలను మంట కలపడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్నారు.

అడ్డగోలుగా ప్లేట్ కలెక్షన్..

వాస్తవానికి రాష్ట్రంలోని దేవాలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించే క్రమంలో ప్లేట్లు పట్టుకొని భక్తుల నుంచి డబ్బులు ఆశించకూడదు. అయినా పెదకాకాని దేవస్థానంలో అర్చకులు అడ్డగోలుగా ప్లేట్ కలెక్షన్స్‌కు పాల్పడుతున్నారు. వేలాది రూపాయలు ప్లేట్ కలెక్షన్ ద్వారా తమ సొంత జేబులో నింపుకుంటున్నారు. దీంతో దేవస్థానం ఆదాయానికి గండి పడుతోంది. లక్షల రూపాయల ఆదాయాన్ని దేవస్థానం హుండీల ద్వారా కోల్పోతుంది. ఈవో శ్రీనివాస్ రెడ్డి హయాంలో అర్చకులు ప్లేట్ కలెక్షన్ ఆపేశారు. అప్పట్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీలు లెక్కించగా హుండీల ద్వారా గతంలో వచ్చే ఆదాయం కన్నా అధికంగా పెరిగింది. ఇప్పుడు మళ్లీ ప్లేట్ కలెక్షన్ ప్రారంభించారు. ఇటీవల హుండీల ఆదాయం గణనీయంగా తగ్గింది. ప్లేట్ కలెక్షన్ తక్షణమే నిలిపివేయాలని భక్తులు ఫిర్యాదు చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

విధులకు హాజరు కాకుండా, సహాయకులచే పూజలు జరిపిస్తున్న వ్యవహారంపై భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆలయానికి చెందిన పూజారులకు మెమోలు జారీ చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. వారి నుంచి వివరణ కోరినట్లు చెప్పారు. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నామని, వారి వివరణ తర్వాత అందుకు బాధ్యులైన పూజారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు కూడా నివేదిక పంపుతామని పేర్కొన్నారు.

కొండమోడు జాతీయ రహదారికి రూ.881.61 కోట్లు మంజూరు

- 49.917 కి.మీ నాలుగు లైన్ల రహదారి నిర్మాణం
- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని సత్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో కొండమోడు జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం తెలిపారు. పేరేచర్ల నుంచి కొండమోడు వరకు రహదారి నిర్మాణానికి రూ. 881.61 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని ఎంపీ ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రజల తరఫున ఆయన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వంలోని భారత్ మాలా ప్రాజెక్టు కింద నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారని చెప్పారు. ఈ రహదారికి సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ రహదారులు నిర్మిస్తారని పేర్కొన్నారు. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఎంపీ తెలిపారు.

ఎరువులు తక్షణమే సరఫరా చేయాలి

జిల్లాలో పంటల అవసరాలకు తగ్గట్టుగా ఎరువులు తక్షణమే సరఫరా చేయాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కెమికల్, ఫర్టిలైజర్స్ మంత్రిత్వ శాఖ కేంద్ర సెక్రెటరీ రజత్ కుమార్ మిశ్రాను కలసి వినతి పత్రం అందజేశారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో వ్యవసాయం ప్రధాన ఆధారమని, ప్రస్తుతం రబీ సాగు జరుగుతుందని, ఖరీఫ్ పంటలకు కూడా ఎరువులు అవసరం ఉందని వివరించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ నెలాఖరు నాటికి 4 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని చెప్పారు. వ్యవసాయ కార్యకలాపాలకు అంతరాయం లేకుండా కొనసాగించేందుకుగానూ చొరవ చూపి తక్షణమే రైతుల డిమాండ్‌కు తగ్గట్టుగా డీఏపీ, యూరియాలను సరఫరా చేయాలని లావు కోరారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు విద్య, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయసు 19 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలని, పదో తరగతి నుంచి పీజీ (2003 నుంచి 2024 విద్యా సంవత్సరాల్లో) వరకు పూర్తి చేసిన ఎవరైనా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా ఉపాధి కార్యాలయం, కావూరి కాంప్లెక్స్, గుజ్జనగుండ్ల గుంటూరు అనే చిరునామాకు ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు. జాబ్‌మేళాలో హెచ్‌సీఎల్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, ఫెయిర్ డీల్, సూర్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమాలజీ తదితర సంస్థలు పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు ుఞఇజూాఝ్బ్బుఇఃజౌఠి.జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 0863-2350060లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా నారా చంద్రబాబు నాటకోత్సవం ప్రారంభం


నాటకోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అభినయ థియేటర్ ట్రస్ట్, రాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడు రోజుల పాటు జరిగే నారా చంద్రబాబు నాటకోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, టీడీపీ నాయకులు దామచర్ల శ్రీనివాస్, కంచర్ల శివరామయ్య, భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, నాటక ప్రముఖుడు ఆలోకం పెద్దబ్బయ్య, వ్యాపారవేత్త నాగళ్ల తిరుపతయ్య ప్రారంభించారు. అనంతరం శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం, శ్రీకాకుళం జిల్లా వారిచే కొత్త పరిమళం, కేజేఆర్, కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారిచే సాహితి సూక్తం నాటికలను ప్రదర్శించారు. ఇండియా, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం, సాహిత్యం సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది అనే అంశంతో రూపొందించిన సాహితి సూక్తం నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా గురువారం సాయంత్రం పూర్ణోదయ ఆర్ట్స్, చీరాల వారిచే నేనేం చేసుకుంటాను, సాయి కార్తీక్ క్రియేషన్ కాకినాడ వారిచే ఎడారిలో వానచినుకు నాటికలను ప్రదర్శించనున్నట్లు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. ట్రస్ట్ సలహాదారుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గద్దె లక్ష్మి పాల్గొనగా, కార్యక్రమాన్ని క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు, గుంటుపల్లి రమణబాబు నిర్వహించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డేశ్వరం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తాడేపల్లి ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. తాడికొండకు చెందిన ఎస్‌కే మస్తాన్ (50) వెల్డర్‌గా పని చేస్తుంటాడు. విజయవాడలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో సామాన్లు కొనుక్కొని ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి తాడేపల్లి బైపాస్ వద్దకు రాగా అక్కడ ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో మస్తాన్ మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని విజయవాడ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

త్రీ ఫేజ్ విద్యుత్ మీటర్లు.. నో స్టాక్

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ త్రిఫేజ్ మీటర్లకు జిల్లాలో తీవ్ర కొరత నెలకొంది. కొన్ని నెలలుగా త్రిఫేజ్ మీటర్లు అంటేనే ఆ శాఖలో అధికారులు నో స్టాక్ అని సమాధానమిస్తున్నారు. దీంతో వేల రూపాయలు డిపాజిట్‌లు చెల్లించిన వినియోగదారులకు నిరీక్షణ తప్పడం లేదు. విద్యుత్ వినియోగానికి అనుగుణంగా త్రిఫేజ్ మీటర్లకు వినియోగదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గృహ వినియోగంతోపాటు వాణిజ్య అవసరాలకు సంబంధించి కేటగిరీ 1, 2కి నగదు డిపాజిట్‌లు చెల్లించారు. డిపాజిట్లు చెల్లించి నెలలు గడుస్తున్నా మీటర్లు మాత్రం రావటం లేదని వినియోగదారులు చెబుతున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే, స్టోర్స్‌లోనే మీటర్లు లేవు ఎలా ఏర్పాటు చేయమంటారంటూ సెక్షన్ స్థాయిలో అధికారుల నుంచి సమాధానం వ్యక్తం అవుతుంది. అవసరానికి అనుగుణంగా త్రిఫేజ్ మీటర్లతో పాటు ఇతర పరికరాలు సమకూర్చటంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా నిర్మాణ దశలో ఉన్న కొన్ని అపార్ట్‌మెంట్స్, కొత్త భవనాల యజమానులు త్రిఫేజ్ మీటర్ల కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు సిబ్బంది త్రిఫేజ్ మీటర్లు ఇప్పిస్తామంటూ రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎల్‌టీ కేటగిరీలోని సింగిల్ ఫేజ్ మీటర్ల కొరత ఉందని సమాచారం. సింగిల్ ఫేజ్ మీటర్లకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి.

ఎల్‌టీ కేటగిరీ కండక్టర్స్‌కు కట...కట

గుంటూరు సర్కిల్ పరిధిలో ఎల్‌టీ కేటగిరీ కండక్టర్స్‌కు కూడా కొంతకాలంగా తీవ్ర కొరత ఉంది. ఎల్‌టీ కేటగిరీలో అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేసిన లైన్‌లు కావటంతో బలహీనంగా తయారవుతున్నాయి. వర్షాలు పడిన సమయాల్లో, వేసవి సమయాల్లో విద్యుత్ వినియోగం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు కండక్టర్స్ తెగిపోతున్న సందర్భాలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే ఐదు దశాబ్దాల కిందట వేసిన కండక్టర్స్‌నే వినియోగిస్తున్నారు. అధ్వానంగా ఉన్న కండక్టర్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యంత్రాంగం వైఫల్యంపై విమర్శలు...

విద్యుత్ మీటర్లతో పాటు కండక్టర్స్‌ను ఇతర పరికరాలను అందుబాటులో ఉంచాల్సిన యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఉన్నతాధికారులు అవసరానికి మించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కొనుగోలు చేయటంలో చూపిన శ్రద్ధ కీలకమైన విద్యుత్ మీటర్లు, కండక్టర్స్‌పై చూపటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా స్టోర్స్‌ను అధికారులు సందర్శించి పరిశీలించటం తప్ప ఫలితం ఏమీలేదు.

నేటి నుంచి '108' వాహనాలు ప్రభుత్వాస్పత్రికి అనుసంధానం

- క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్యం కోసమే..
- 70 అంబులెన్స్‌లు జీజీహెచ్‌కు అనుసంధానం
- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడి


సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు(మెడికల్) అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా '108' అంబులెన్స్ వాహనాలను గురువారం నుంచి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి అనుసంధానం చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలో 70 అంబులెన్స్ వాహనాలను జీజీహెచ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రోగులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు బుధవారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల 108 కోఆర్డినేటర్లు, ఈసీజీ టెక్నీషియన్లు, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్లు, ఆర్ఎంవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగినా క్షతగాత్రులను అత్యవసర చికిత్సల కోసం 108 అంబులెన్స్ వాహనాల్లో గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చి, తక్షణం వైద్యచికిత్సలు లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనాల్లో రోగులను జీజీహెచ్‌కు తెచ్చే క్రమంలో ముందుగానే 108 అంబులెన్స్ సిబ్బంది రోగుల వివరాలను ఆసుపత్రి అధికారులకు తెలియజేస్తే, ముందుగానే వెంటిలేటర్, ఇతర సౌకర్యాలు, వైద్యులను సిద్ధంగా ఉంచుతామని ఆయన తెలిపారు. ఆసుపత్రికి వచ్చేలోపు వాహనంలో ఉన్న క్రిటికల్ కేసులకు అందించాల్సిన ప్రథమ చికిత్సలపై జీజీహెచ్ వైద్యులు, 108 సిబ్బందికి ఫోన్‌లో తగిన సూచనలు, సలహాలు కూడా ఇస్తారని సూపరింటెండెంట్ తెలిపారు. ఇందుకోసం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవో, సీఎంవో, ఇతర ముఖ్యమైన వైద్యులతో 108 సిబ్బందికి వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీని వలన సమాచారం తెలిసి వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమై రోగిని కాపాడేందుకు దోహదపడుతుందని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘం (హెచ్‌డీఎస్) సభ్యుడు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఆర్ఎంవోలు డాక్టర్ బి. సతీష్‌కుమార్, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ యువరాణి, ఎస్పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారామ, సీఎంవో డాక్టర్ ఎస్‌కే.నిష్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

- 42వ రోజు ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ


దివ్యాంగుని నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా ప్రజాదర్బార్ నిలుస్తుండడంతో నిర్భయంగా తమ సమస్యలు యువనేత లోకేశ్‌కు చెప్పుకునేందుకు మంగళగిరి నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి సమస్యలు చెప్పి లోకేశ్ వద్ద భరోసా తీసుకుని వెళుతున్నారు. బుధవారం 42వ రోజు ఉండవల్లి ప్రజాదర్బార్‌లో పలు విజ్ఞప్తులు వచ్చాయి. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన పి.సాంబశివరావు తాను తీవ్ర అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నానని, తనకు ఎలాంటి ఆధారం లేదని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. యర్రబాలెంకు చెందిన ఎస్‌కె. నసీమా మాట్లాడుతూ తాను హెచ్ఐవీతో బాధ పడుతున్నానని మందులు కొనుగోలు చేసేందుకు కూడా ఆర్థిక స్థోమత లేదని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవడంతోపాటు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. పక్షవాతంతో బాధ పడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కుంచనపల్లికి చెందిన కృపారావు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నిలిపివేసిన రైతు కూలీ పెన్షన్ పునరుద్ధరించాలని యర్రబాలెంకు చెందిన సీహెచ్ రమాదేవి విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ చదివిన తన కుమారుడికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని నులకపేటకు చెందిన పెద్దిరాజు కోరారు. సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞప్తులివే...

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులోని పులివాగు ఆక్రమణలు తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గుంటక సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేశ్ పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. తమకు వారసత్వంగా సంక్రమించిన 20 ఎకరాల ఇనాం భూములను స్థానికులు ఆక్రమించారని ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారని తమకు న్యాయం చేయాలని కడప జిల్లా కలశపాడు మండలం ముద్దంవారిపల్లికి చెందిన గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో గత మూడేళ్ల నుంచి పని చేస్తున్న 30 మంది బోధనేతర సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారని, విధుల్లోకి తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని నాన్ టీచింగ్ సిబ్బంది మంత్రి లోకేశ్‌కి విజ్ఞప్తి చేశారు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలకు తమ ఇల్లు నీటమునిగి సామగ్రి, నిత్యావసరాలు పాడైపోయాయని, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయని పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 8 క్రస్ట్ గేట్ల ఎత్తివేత

రెంటచింతల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 8 రేడియల్ క్రస్ట్ గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 87,889 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె. వెంకటరమణ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0768 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

64,800 క్యూసెక్కులు విడుదల

మాచర్లటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 8 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,022, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,907, 8 క్రస్ట్‌గేట్ల ద్వారా 64,800, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 1,08,782 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,08,782 క్యూసెక్కుల నీరు చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 99,065 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 99,065 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

42,845 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 45,003 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,845 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,483 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16200	334	8200	14500
నెంబరు. 5	9500	14500	నెంబరు. 5	10500	13800
273	12000	14000	273	12000	14500
341	9000	15500	341	9000	15500
4884	12000	13500	4884	15000	16500
సూపర్ 10	11000	11000	సూపర్ 10	10000	15700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8500	18500	తేజ	10000	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9800	14000
దేవనూరు డీలక్స్	9500	15300	దేవనూరు డీలక్స్	12500	14500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10500



గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణప్రసాద్

సాంప్రదాయ వంటలను డిజిటలైజ్ చేయాలి

గుంటూరు విద్య,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంట్లో అమ్మమ్మలు సంప్రదాయ వంటలు ఎలా తయారు చేస్తారో తెసుకుని ఆ విధానాన్ని డిజిటలైజ్ చేయాలని తెనాలి డబుల్ హార్స్ గ్రూపు జీఎం ఎన్వీ కృష్ణప్రసాద్ పొలిశెట్టి సూచించారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ ,ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 70 సంవత్సరాలు పైబడిన మహిళలను సంప్రదించామని, వారు భిన్న రకాలైన వంటలను,వాటి తయారీ విధానం తెలియజేశారని తెలిపారు. ఇప్పటి తరం వారికి కొన్ని వంటల తెలియక పోవడం శోచనీయమని అన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలంటే తగినవ్యాయామం, ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుతులు అందజేశారు. ఇకార్యక్రమంలో వీసీ ఆచార్య పి.నాగభూషణ్, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్థన్

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహించిన మంగళగిరి మున్సిపల్ రింక్ రోలర్ స్కేటింగ్ డిస్ట్రిక్ట్ లెవెల్ పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఇ హైస్కూల్లో 1వ తరగతి చదువు తున్న సజ్జల మనస్విని అండర్ 9 రింగ్ 4,5,6 విభాగంలో, 5వ తరగతి చదువుతున్న సజ్జల గణేష్ రింగ్ 2,3, రోడ్ 1 పోటీలలో రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకమును సాధించి, రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారని సెక్రటరీ అండ్ కర స్పాం డెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలను కూడా ప్రోత్స హిస్తున్న వారి తల్లిదండ్రులను, మెరుగైన శిక్షణ ఇచ్చిన ఇమ్రాన్‌ని అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి.లక్ష్మణరావు, పాల్గొన్న యూనియన్ నాయకులు

22న ఎస్ ఈ కార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు జీ పవన్, కేరాంబాబు, నాయకులు అశోక్ తిరుపతయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏటుకూరు రోడ్డులోని సింహపురి ఎస్టేట్, జగదాంబ ఎస్టేట్, డంపింగ్ యార్డు, గంగయ్య ఎస్టేట్, పీకలవాగు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లచెరువు ఏఈఈ బి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పాతగుంటూరులో హారెత్తిస్తున్న కోతులు

● రోడ్లపై రాకపోకలు సాగించాలంటే భయపడుతోన్న ప్రజలు
● కోతుల బెడద నుంచి రక్షించాలని స్థానికుల వినతి



పాతగుంటూరులోని ఓ ఇంటిపైన కూర్చున్న కోతులు

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): పాతగుంటూరులో కోతులు హల్ చల్ సృష్టిస్తున్నాయి. కోతుల చేష్టలతో స్థానికులు బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత నెల రోజులుగా కోతుల బెడద మరింత ఎక్కువవుతోందని స్థానికులు వాపోతు న్నారు. పాత గుంటూరు బొడ్డురాయి సెంటర్, మానూరు వారి వీధి, సిటీ పబ్లిక్‌స్కూల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆయా వీధుల్లో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. రోడ్లపై నడచుకుంటే వెళ్లే వారి చేతుల్లో ఉన్న సంచులు, వస్తువులను, ఆహార ప్యాకెట్లను లాక్కెళ్ళేందుకు కోతులు ప్రయత్నించడం, ఇళ్ళపై దుస్తులు, ఇతర వస్తువులు ఎత్తుకెళుతుండటంతో ఏమి చేయాలో తెలియని స్థానికులు బిక్క ముఖాలు వేస్తున్నారు. రాత్రి సమయాల్లో కూడా కోతులు 'తగ్గేదేలే' అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాయి. ఏ వైపు నుంచి వచ్చి కోతులు మీద పడతాయోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్పు కనిపించేలా కృషి చేయాలి

● పట్టాభిపురం మస్టర్ పాయింట్ తనిఖీ
● శానిటేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



పట్టాభిపురంలోని మస్టర్ పాయింట్‌లో హాజరు పట్టీని తనిఖీ చేస్తున్న కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించేందుకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, అధికారులు, సిబ్బంది పనితీరు మార్చుకొని అంకిత భావంతో పని చేయకుంటే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఉదయం 5:30 గంటలకు పట్టాభిపురం మస్టర్ పాయింట్‌ని తనిఖీ చేసి, కార్మికుల హాజరు, సెలవుల నమోదు రిజిస్టర్లను పరి శీలించిన ఆయన తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాటాడుతూ మెరుగైన పారిశుధ్యం కోసం 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, నగరంలో మార్పు కనిపించాలని, అందుకు తగిన విధంగా అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్మికులు కృషి చేయా లన్నారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టాభిపురం మస్టర్ పాయింట్‌లో కార్మికులు సెలవులు తీసు కున్న రోజులకు, రిజిస్టర్‌లో నమోదు చేసిన రోజులకు వ్యత్యాసం గమనించి, సంబంధిత ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని విధానంలో మార్పు రావాలని, ప్రజారోగ్య కార్మికులకు ఉదయం 5:30, మధ్యాహ్నం 2:30 గంటలకు మస్టర్ కార్యాలయంలోనే ఐరిష్ ద్వారా వారి హాజరుని తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ శానిటేషన్ పర్యవేక్షణ అధికారులు తప్పనిసరిగా మస్టర్ పరిశీలించాలని, క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక అరండల్‌పేట మెయిన్ రోడ్‌లోని డ్రెయిన్లలో పూడిక తీత పనులను పరిశీలించారు. డ్రెయిన్లపై ఆక్రమణలు, ర్యాంప్‌లు ఉంటే తొలగించు కోవాలని సదరు యజమానులకు తెలియజేయాలని, వారు స్పందించ కుంటే వాటిని పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. స్థానిక లాలా పేటలో పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన, డ్రెయిన్లు, రోడ్ క్రాసింగ్ పాయింట్ల వద్ద కల్వర్ట్ నిర్మాణపు పనులు వేగవంతంగా చేపట్టాలని, అంతర్గత డ్రెయిన్లపై ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. పర్యటనలో స్పెషల్ శానిటేషన్ పర్యవేక్షణ అధికారులు సుందరరామిరెడ్డి, నాగ భూషణం, రమేష్ బాబు, కార్పొరేటర్ చిస్టి, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, ఐజాక్, మనోహర్ బాబు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

● రూ.5 లక్షల 15 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం

గుంటూరు, అక్టోబరు 16 : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో ఇరువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వంశీధర్ వివరాలు నిందితులు మిక్కిలి సందీప్, పఠాన్ మస్తాన్ వలిని మీడియా ఎదుట హాజరు పరిచారు. సీఐ కథనం మేరకు శారదా కాలనీ 17వ లైన్‌కు చెందిన సందీప్, 13వ లైన్ కి చెందిన మస్తాన్ వలిపై గతంలో పలు కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో పాత నేరస్థులైన వీరిద్దరూ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. అందుకు అవసరమైన డబ్బును, కష్టపడకుండా సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా గత నెలలో చిలకలూరిపేట రోడ్డులోని కళ్యం స్పిన్నింగ్ మిల్లు కార్యాలయంలో తాళాలు పగలగొట్టి డబ్బులు అపహరించారు. అదేవిధంగా మేడికొండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైయస్సార్ కోల్డ్ స్టోరేజీ సమీపంలోని ఓ ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. ఈ మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఇన్చార్జి సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు పర్యవేక్షణలో నల్లపాడు సీఐ వంశీధర్, హెడ్ కానిస్టేబుల్ కే సుబ్బారావు, కానిస్టేబుళ్ళు మస్తాన్‌వలి, బిక్ష నాయక్, సాంబశివరావు బుధవారం ఉదయం చిలకలూరిపేట రోడ్డులోని వై జంక్షన్ సమీపంలో సందీప్, పఠాన్ మస్తాన్ వలిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు లక్షల పదిహేను వేల రూపాయల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ సెల్ ఫోన్ డ్రైవింగ్

● ఫోన్‌లో చిత్రీకరించిన ప్రయాణికుడు డీపీటీవోకు ఫిర్యాదు
● కండక్టర్‌పై చర్యలు
● ఆందోళనకు సిద్ధంగా ఉద్యోగ సంఘాలు

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం, కఠిన చర్యలు తీసుకుంటామంటూ పదే పదే ఆర్టీసీ అధికారులు హెచ్చరికలు చేస్తున్నా, కొందరు ఆర్టీసీ డ్రైవర్ల తీరు మారడం లేదు. విభజిత గుంటూరు జిల్లాలోని ఓ డిపోలో ఇటీవల ఓ డ్రైవర్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్‌లో వీడియో చూస్తుండటంపై ఫిర్యాదు రావటం చర్చనీయాంశమైంది. డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెల్‌ఫోన్‌లో వీడియో చూస్తుండటాన్ని బస్సులోని ఓ ప్రయాణికుడు గమనించి తన సెల్ ఫోన్‌లో రికార్డు చేసి జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి (డీపీటీవో)కి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదును సీరియస్‌గా పరిగణించిన డీపీటీవో, దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని సదరు డిపో మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా డిపో అధికారులు వ్యవహరించిన తీరు మరింత వివాదాస్పదమైంది. నిర్లక్ష్యంగా సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాల్సిన డిపో అధి కారులు, అదే బస్సులో విధులు నిర్వహిస్తోన్న మహిళా కండక్టర్‌ను విధుల నుంచి తప్పించి చర్యలు తీసు కోవడం సహోద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. మూడు రోజులుగా సదరు కండక్టర్‌ను విధుల నుంచి తప్పించారు. 'డ్రైవర్ సెల్ ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేస్తుంటే మీరేం చేస్తున్నారు. మీరు చూసుకోవద్దా' అని మహిళా కండక్టర్‌ను డిపో అధికారులు హెచ్చరించి నట్లు సమాచారం. దీనిపై ఉద్యోగ సంఘాల నాయ కులు మండిపడుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌ను వదిలేసి మహిళా కండక్టర్‌పై చర్యలు తీసు కోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై త్వరలో డీపీటీవోను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మిగతా యూనియన్‌లను కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు నాయకులు చెప్పారు.

మహిళా రైతులకు సన్మానం



ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు విజయలక్ష్మిని సన్మానిస్తున్న నున్న వెంకటేశ్వర్లు, రాజకుమారి

గుంటూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మహిళా రైతులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి,వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పీడీ నున్న వెంకటేశ్వర్లు అన్నారు.మహిళా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు లోని కృషి భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డెప్యూటీ డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు, రైతు సాధికార సంస్థ అధికారి అరుణ, శాస్త్రవేత్త గంగా దేవి,ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ కె.రాజకుమారి డాక్టర్ సత్యప్రియ, మహిళా రైతులు తోలు విజయలక్ష్మి, ఎస్ కమలమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

హోరాహోరీగా చదరంగపు పోటీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): లీలావతి మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక గోరంట్ల, నెక్స్‌జన్ పాఠశాలలో జరుగుతున్న అండర్-15 బాల, బాలికల రాష్ట్ర చదరంగపు పోటీలు హోరా, హోరీగా జరుగుతున్నాయి. ఆరు రౌండ్‌లు పూర్తయ్యేసరికి 6 పాయింట్లతో కృష్ణా జిల్లాకు చెందిన కొల్ల భావన్, తిరుపతి జిల్లాకు చెందిన వి త్రిపురాంబిక అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా ఫణికుమార్‌గా వ్యవహరిస్తున్నారు. ఫైనల్ పోటీలు గురువారం జరుగుతాయని టోర్నమెంట్ డైరెక్టర్ వైవీకే చక్రవర్తి తెలిపారు.

20న సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ది బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదిన గుంటూరు స్థానిక ఎన్జీవో క్లబ్‌లో సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి ఈ శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు నవంబరు 8 నుంచి కర్నూలు జిల్లా, నంద్యాలలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 93969 90666 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు కావాలి

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన వారంతా పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ ఆర్‌వీ సింగరయ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన గైడెన్స్ సెల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో బుధవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఈ హోమం చేశారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో వేదపండితుల నిర్వహణలో విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే మాధవి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అండగా ఉండి, జవాబుదారీతనంతో ఉండే ఏకైక ప్రభుత్వం ఎన్డియే ప్రభుత్వమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలపై ఆరా తీస్తూ, వారిని ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు ప్రజలు తన కార్యాలయానికి వచ్చి అనేక సమస్యలు తెలియజేస్తున్నారని, ప్రజల నుంచి వచ్చిన వినతులన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నిధులు కేటాయింపు కోసం మంత్రికి ఎమ్మెల్యే వినతి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృధికి కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే మాధవి కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రితో బుధవారం ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారానికి నిధుల సమస్య అడ్డంకిగా మారిందని, గుంటూరులో కనీస మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

బీసీ హాస్టల్ విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బీసీ వసతి గృహంలోని చిన్నారులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక రాజాగారితోట ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ఇటీవల సందర్శించిన సందర్భంలో తమకు దుప్పట్లు పంపిణీ చేయాలని విద్యార్థినులు ఆయన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఆయన చాంబర్ ఆఫ్ కామర్స్ వారితో మాట్లాడి హాస్టల్‌లోని 170 మంది విద్యార్థినులకు దుప్పట్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యా ర్థినీ, విద్యార్థులను సొంత బిడ్డల్లా ఆదరిస్తోందని, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలతో పాటు చిన్నా రుల అవసరాలను తెలుసుకుని వాటిని నెరవేర్చడం తమకు సంతృప్తినిచ్చిందని అన్నారు.

బోనబోయిన రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలి

జనసేన రాష్ట్ర నాయకుడు, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా నగరంలోని జనసేన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. కార్య క్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిరాల మ్యానీ, పెద్దిబోయిన బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగస్తులు ట్రెజరీ బిల్లు రిజిస్టర్ నిర్వహణా విధానంపై అవగాహన

● ఈదర వీరయ్య

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ట్రెజరీ బిల్లు రిజిస్టర్ నిర్వహించాల్సిన విధానం గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెజరీ బిల్లు రిజిస్టరు ఏపీటీసీ ట్రెజరీ రూల్ 16లో తెలిపిన పద్ధతిలో నిర్వహించాలని, ఏపీటీసీలోని అనుబంధం 26లో తెలిపిన ఫారం-70 ఫారం ట్రెజరీ బిల్లు రిజిస్టరు ఉండాలని పేర్కొన్నారు. ట్రెజరీ సమర్పించే అన్ని రకాల బిల్లుల వివరాలు ఇందులో నమోదు చేయా లన్నారు. ఒక వేళ ఏ బిల్లుపైనైనా అభ్యంతరాలు తెలుపుతూ సరిదిద్దేందుకు వెనుకకు పంపితే వాటి విషయమై ట్రెజరీ బిల్లు రిజిస్టర్‌లో మళ్లీ తాజా వివరాలు నమోదు చేస్తూ సరిచేసిన బిల్లులు ట్రెజరీకి పంపాలని తెలిపారు. ట్రెజరీకి సమర్పించిన బిల్లులపై వారి పూర్తి మొత్తాలకు అంగీకరించక కొంత మేర తగ్గింపులు చేస్తూ ఆ విధంగా తగ్గించిన వివరాలు ట్రెజరీ నుంచి పొందాలని, నగదు కోసం బిల్లులపై ఎండార్స్‌మెంట్ చేయనప్పుడు అధికారి తనకు గల ఆర్థికపర పరిధులను గుర్తించుకోవాలని తెలిపారు. రెండు రకాల సమాంతర ట్రెజరీ బిల్లు రిజిస్టర్లు నిర్వహించకుండా అధికారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వాడకంలో ఉన్న ట్రెజరీ బిల్లు రిజిస్టరు పూర్తిగా ఉపయోగించిన తరువాత కొత్త ట్రెజరీ బిల్లు రిజిస్టరు తెరవాల్సిన సందర్భంలో ప్రభుత్వ ఉత్తర్వులు 172లో తెలిపిన సర్టిఫికెట్‌లు రికార్డు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. తప్పుడు పద్ధతుల ద్వారా బిల్లులు సమర్పించి బిల్లుల మొత్తాలను పొందే అవకాశాలను అరికట్టేందుకు, ట్రెజరీ బిల్స్ రిజిస్టరు రెండు వారాలకొకసారి సంబంధిత అధికారి సమీక్షించి, తేలిన ఫలితాలను, నిబంధనల ప్రకారం రికార్డు చేయాలని తెలిపారు. లేనిది పరిశీలించి, సరిగా ఉన్న యెడల నకలు ప్రతిలో అమోదించినట్లు ధృవీకరణ సర్టిఫికెట్ నమోదు చేస్తూ 15వ తేదీ లోగా పంపకపోతే ట్రెజరీ వారు పంపిన ట్రెజరీ వివరాలు ఆమోదించినట్లు భావించాల్సి ఉంటుందని వీరయ్య తెలిపారు.

ఊర పిచ్చుక.. ఊసేదీ..?





- సెల్‌ఫోన్ కాలుష్యంతో మాయమైన ఆత్మ బంధువులు
- ప్రమాదకర స్థాయిలో రేడియేషన్ ప్రభావంతోనే..
- మితిమీరిన సెల్‌ఫోన్ వినియోగంతో ప్రమాద ఘంటికలు
- రామచిలుక, గోరువంక, పాలపిట్ట, గుడ్లగూబల ఉనికీ ప్రశ్నార్థకమే!
- పిచ్చుకలనే కాదు.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిందే!

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఊరపిచ్చుకలు ఎక్కడికెళ్లాయో, ఏమైపోయాయో, తెలియదు. నిజం చెప్పాలంటే, ఈ తరం చిన్నారులకు ఊర పిచ్చుక ఊసే తెలియని పరిస్థితి. అంతకు మించిన విషాదం ఏముంటుంది? ఊర పిచ్చుక కనిపించకపోతే విషాదమేంటి అనుకుంటున్నారా? అది విషాదమే కాదు.. రాబోయే ప్రమాదానికి సంకేతం కూడా! ఆ విషయాలను తెలుసుకుందాం..

● సెల్‌ఫోన్ రాక.. ఆత్మబంధువు పోక!

మన ఇంట్లో నిత్యం సందడి చేసే పిచ్చుకలను ఊర పిచ్చు కలు అంటుంటారు. వీటి శాస్త్రీయ నామం పాసర్ డొమెస్టికస్ ఇండికస్. ఇది మన ఇళ్లలోనే వుంటుంది కనుక 'ఇంటి పిచ్చుక 'అని కూడా పిలవొచ్చు. ఇంటిోకి వచ్చే పురుగు, పుత్రను తింటూ మనల్ని రోగాల బారి నుంచి కాపాడుతుంటాయి. అటువంటివి పిచ్చుకలు ఉన్నట్లుండి కనిపించకుండా పోయాయి. అందుకు కారణం కమ్యూనికేషన్ విప్లవమే. నాణానికి బొమ్మా.. బొరుసు వున్నట్లు.. సాంకేతిక విప్లవం వల్ల మంచీచెడూ రెండూ వుంటాయి. మూడు దశాబ్దాల క్రితం వచ్చిన కమ్యూనికేషన్ విప్లవం సెల్‌ఫోన్ రూపంలో ప్రపంచం మొత్తాన్ని చాప చుట్టి మన అరచేతిలో పెట్టింది. అప్పటి వరకూ ఉన్న తపాలా, టెలీగ్రామ్, టెలిఫోన్‌ల స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించింది. విద్యుదయస్కాంత తరంగాల ద్వారా సగటు మనిషిని ప్రపంచంతో అనుసంధానం చేసింది. ఇదంతా నాణానికి ఒక వైపే. మరీ, రెండో వైపు మరోలా వుంది. సెల్‌ఫోన్ల వినియోగం కోసం భారీ స్థాయిలో సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఊరూవాడా అన్న తేడా లేకుండా సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఊరిలో నాలు గైదు సెల్ టవర్లు వుంటే, పట్టణాలు, నగరాల్లో పదులు, వందల సంఖ్యలో టవర్లు వుంటున్నాయి. సెల్ టవర్లు, సెల్‌ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ చిన్న చిన్న జీవరాశులను, ప్రధానంగా పక్షి కోటిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రేడియేషన్‌ను తట్టుకోలేక చిన్న చిన్న పక్షులు కనుమరుగైపోయాయి. ఆ క్రమంలోనే ఊర పిచ్చుక ఊసు కూడా ఆగిపోయింది. ఈ విషయం గమనించే నాటికే ఊరపిచ్చుక ఉనికే కనుమరుగైపోయింది.

> ఊర పిచ్చుక లేని ఊరు.. ఇంటి పిచ్చుక సందడి లేని ఇల్లు ఒకప్పుడు లేదంటే.. అతిశయోక్తి కాదు! మనతోనే ఉంటూ, మనకు ఊసులు చెప్పుకుంటూ, వరండా చూరుకు వేలాడదీసిన జొన్నపొత్తులు, వరి కంకులు తింటూ, చేటతో బియ్యం చెరిగి అమ్మ ఏరిపారేసిన వడ్లగింజలను ఏరుకుని తింటూ, బుజ్జి బుజ్జి గెంతులు వేస్తూ, కిచకిచ మంటూ మనతోనే తిరిగే ఊర పిచ్చుకలు.. మన ఇంట్లోనే ఏదో ఒక మూల తన ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుని మనతోనే కలిసి బతికే ఆత్మబంధువుల వంటి ఇంటి పిచ్చుకల గురించి తెలియని పాత తరం వారు ఎవరూ ఉండరు. అయితే, మనతో అంతలా తమ జీవితాన్ని పెనవేసుకున్న ఈ ఆత్మబంధువులు మనకు దూరమైపోయాయి.

● మానవాళికి ప్రమాద సంకేతం!

గడిచిన దశాబ్దకాలంలో సెల్‌ఫోన్ వినియోగం మరింత పెరిగింది. స్మార్ట్‌ఫోన్ యుగం ప్రారంభమైంది మొదలు ప్రతి ఇంట్లో రెండూ, అంతకు మించిన సంఖ్యలో స్మార్టుఫోన్లు వుంటున్నాయి. చివరకు, పసికందులను ఊరడించడానికి సైతం స్మార్ట్ ఫోన్లను వాడేస్తున్నారు. వాటి నుంచి వచ్చే రేడియేషన్ దుష్పరిణామాలను ఏమాత్రం పట్టించుకోకుండా వాటిని వాడేస్తున్నారు. మితిమీరిన స్మార్టు ఫోన్ల వినియోగంతో విపరీతమైన రేడియేషన్ వెలువడుతోందని నిపుణులు చెబుతున్నారు. 3జీ నుంచి 4జీకి, 4జీ నుంచి 5జీకి, 5జీ నుంచి 6జీకి కమ్యూనికేషన్ వ్యవస్థ పురోగమించే కొద్దీ మానవాళిపై ఈ దుష్పరిణామాలు అధికంగా ఉండబోతున్నాయి. చిన్న ప్రాణులు అయిన పిచ్చుకల వంటివి మౌనంగా నిష్క్రమిస్తుండగా, పెద్ద ప్రాణాలైన మానవకోటిపై ఈ ప్రభావం కొద్దికొద్దిగా పడుతూ వస్తోంది. రక్తపోటు, మధుమేహం, నరాల సంబంధిత వ్యాధులు, నాడీ, గుండె సంబంధిత అనారోగ్యాలు, గర్భ సంబంధిత సమ స్యలు పెరగడానికి స్థాయిని మించిన రేడియేషన్ కూడా కారణ మని శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. సెల్‌ఫోన్ చెవిలో పెట్టుకునే మనుషులు మాత్రం ఆయా సూచనలను పెడచెవిన పెడుతున్నారు. ఫలితంగా మానవాళి ప్రమాదపు టంచులకు చేరువవుతోంది.

● అవగాహన అనివార్యం..

కమ్యూనికేషన్ విప్లవ ఫలాలను అనుభవిస్తూనే, వాటి తాలూకు దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి. రాబోయే ప్రమాద తీవ్రతను మానవ సమాజానికి అర్థమయ్యేలా చెప్పేందుకు తగిన కార్యాచరణ రూపొందించు కోవాలి. అంతర్థానమైపోతున్న ఊరపిచ్చుక లాంటి మూగ జీవాల ఉదంతాలను చిన్ననాటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. ఊర పిచ్చుకే కాకుండా రామచిలుక, గోరింక, గుడ్లగూబ, పాలపిట్ట వంటి వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇటువంటి విషయాలను పిల్లలకు చెప్పడంతో పాటు వాటికి గల కార ణాలను చిన్నారులకు వివరించాలి. పాఠశాలలు, విద్యాలయాల్లో వాటిపై వక్తృత్వం, వ్యాసరచన, పాటలు వంటి పోటీలు నిర్వహించి అవగాహన కల్పించాలి. ప్రజల్లో కూడా అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు రూపొందించాలి.

బీసీ వసతి గృహాల్లో.. డిజిటల్ పాఠాలు





ఏర్పాటు చేయనున్న డిటిజల్ బోర్డు

గుంటూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టళ్లలో త్వరలో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. తొలి విడత నాలుగు వసతిగృహాల్లో బోధనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు పంపారు. వచ్చే నెలలో ఎంపికలు పూర్తి చేసి బాలల దినోత్సవం రోజున విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54 వసతిగృహాలు ఉండగా 43 బాలుర కోసం మరో 11 బాలికల కోసం కేటాయించారు. ఆయా వసతిగృహాల్లో దాదాపు 5 వేల మందికిపైగా విద్యార్థులు 3 నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో పదో తరగతి విద్యార్థులు 800 మందికిపైగా ఉన్నారు. ఆయా విద్యార్థులకు గణితం, ఆంగ్లం, హిందీ, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్, నెలనెల డైట్‌చార్జీలు చెల్లింపులో నాటి ప్రభుత్వం తీవ్రజాప్యం చేసింది. కొన్ని హాస్టళ్లలో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీర్చాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహాల్లో రాత్రి పూట విద్యార్థుల్ని చదివించడానికి 2019కి ముందు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్యూటర్స్ నియామకం అటకెక్కింది. ఈ పరిస్థితుల్లో హాస్టళ్లలోని విద్యార్థుల అవసరాలు, ఆకలితో పాటు చదువులు కూడా అడుగంటిపోయాయి. ఈ పరిస్థితులను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. ఇందులో భాగంగా విద్యలో ఇతర విద్యార్థులతో సమానంగా మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో తొలుత బీసీ వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేకంగా బోధకుల్ని నియమించాలని యోచిస్తున్నది. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత వసతిగృహాల్లో డిజిటల్ క్లాసులు ప్రారంభించనున్నారు. ఈ క్లాసుల్లో సబ్జెక్టుల వారీగా బోధనతోపాటు సందేహాలు నివృత్తి చేయనున్నారు. ఇందుకోసం వసతిగృహాల్లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి అక్కడ ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు ఏర్పాటు చేస్తారు. బోధించే ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ.1500 నుంచి రూ.2వేలు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. తొలుత నాలుగు హాస్టళ్లలో డిజటల్ క్లాసుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు.

పోస్టు కోసం.. పట్టు

విజిలెన్స్ ఏవో సీటుకు సిఫార్సులు

పోటీ పడుతున్న వ్యవసాయాధికారులు



గుంటూరు విజిలెన్స్ కార్యాలయం

గుంటూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్‌లో వ్యవసాయ శాఖ అధికారి పోస్టు కోసం పోటీ నెలకొంది. అనేక దాడులు.. ఆదాయ మార్గాలు పుష్కలంగా ఉండటంతో ఈ పోస్టు కోసం సుమారు డజను మంది వ్యవసాయశాఖలోని ఏవోలు పోటీ పడుతున్నారు. పోస్టు దక్కించుకునేందుకు జోన్ -3 పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు పావులు కదుపుతున్నారు. అందుకోసం భారీగా వెచ్చించేందుకు సిద్ధపడినట్లు తెలుస్తుంది. ముఖ్య రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయించేందుకు పలువురు రంగం సిద్ధం చేసుకున్నారు. గుంటూరులోని విజిలెన్స్ కార్యాలయంలో ఇప్పటివరకు ఏవోగా పనిచేసిన రమణకుమార్‌ను మాతృ శాఖకు పంపిస్తూ డీజీ హరీష్‌కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల క్రితం రమణకుమార్‌ను ఈ పోస్టులో నియమించారు. ఇప్పుడు ఖాళీగా ఉన్న పోస్టులో కొత్త వారిని నియమించడం అనివార్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు ఏవోలు ఈ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్ల కాల వ్యవధితో డెప్యూటేషన్ వేయిం చుకునేందుకు పలువురు ప్రయత్నాలు ప్రారంభించారు. విజిలెన్స్ డీజీ ఈ నియామకం చేపట్టాల్సి ఉంది. హోంమంత్రి ద్వారా సిఫార్సు చేయించుకునేందుకు ఆసక్తి కలిగిన అధికారులు పావులు కదుపుతున్నారని తెలిసింది.

ఎవరి ప్రయత్నాలు వారివే...

విజిలెన్స్ ఏవో పోస్టు కోసం ప్రకాశం జిల్లాకు చెందిన కొందరు అధికారులు తీవ్రంగా పోటీపడుతున్నారు. అక్కడ ఉన్న అధికారికి ముఖ్య నేతలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పల్నాడు ప్రాంతానికి చెందిన కొందరు ఏవోలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ ఒక సీనియర్ నేత వారికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. హోంమంత్రితో కూడిన వ్యవహారం కావటంతో సీనియర్ నేతలను పలువురు ఏవోలు ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ ముఖ్య నేత వద్దకు ఒకరిద్దరు ఏవో లు వెళ్లగా శాఖపై పట్టున్న వారికే తాను సిఫార్సు చేస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. ఏదో అసలో.. ఏది నకిలీనో.. తెలిసిన వారికి ఈ పోస్టు దక్కటం న్యాయం అని ఆయన చెప్పినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల.. క్షేత్ర పరిశీలన ఎప్పుడు..?

- ఇప్పటివరకు దాఖలు చేసిన అప్లికేషన్ల స్టేటస్‌లన్నీ పెండింగ్
- ఏఈఆర్‌వో, ఈఆర్‌వో రిమార్కులు రాయని పరిస్థితి
- బీఎల్‌వోల నియామకంలోనూ అస్పష్టత

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులు దాఖలు చేస్తున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. నిత్యం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వస్తున్న అప్లికేషన్లను ఎప్పటికప్పుడు బీఎల్‌వోలకు పంపించి క్షేత్ర పరిశీలన చేయించడం లేదు. అసలు ఈ ఎన్నిక ఓటరు నమోదుకు బీఎల్‌వోలు ఎవరనేది ఇంతవరకు స్పష్టం లేకుండా పోయింది. దరఖాస్తులు మాత్రం ఏఈఆర్‌వో ఆఫీసుల్లో అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొంటున్న అప్లికేషన్లకు రిఫరెన్స్ నెంబరు ఇస్తున్నారు. దానికి సంబంధించి స్టేటస్ ట్రాకింగ్ చేస్తే రెండు వారాల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నది. ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వో రిమార్కులు నమోదు చేస్తేనే స్టేటస్ అప్‌డేట్ అవుతుంది. గతంలో చివరి రోజు వరకు దరఖాస్తులను అలానే ఉంచి సిబ్బందితో కార్యాలయాల్లో కొన్నింటిని ఆమోదించి, తిరస్కరించేవారు. దాంతో చాలామంది అర్హులు ఓటరుగా నమోదు అయ్యేవారు కాదు.


ఆ పరిస్థితుల్లో మళ్లీ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పెట్టుకొని నిరీక్షించేవారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అయ్యేలా ఉన్నది. గత నెల 30వ తేదీన పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు నమోదు కోసం నోటిఫికేషన్ విడుదల జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 16వ తేదీన రీ పబ్లికేషన్ కూడా చేశారు. అలానే 25వ తేదీన రెండో రీపబ్లికేషన్ కూడా జరగనుంది. నవంబరు 6వ తేదీ వరకు మాత్రమే అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. నేటి ఐటీ యుగంలో చాలామంది ఆన్‌లైన్‌లోనే ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకొంటున్నారు.

ఇక ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు పలుచోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తు చేయిస్తున్నారు కొన్ని సంఘాలైతే గంపగుత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. ఒకపక్క జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి గంపగుత్తగా దరఖాస్తులు ఆమోదించబోమని చెబుతున్నప్పటికీ ఎన్‌జీవోలు మాత్రం స్వీకరిస్తూనే ఉన్నాయి.

వేల సంఖ్యలో దరఖాస్తులు

కాగా ఇప్పటికే రెండు జిల్లాల నుంచి వేల సంఖ్యలో పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో పెట్టుకొన్నారు. వాటిని ఎవరితో ఎప్పుడు క్షేత్ర పరిశీలన చేయిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది.

మరోవైపు గడువు తేదీ మూడు వారాల్లోకి వచ్చేసింది. నవంబరు 23న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే ఆ తర్వాత ఓటరుగా నమోదు కావడం చాలా కష్టం అవుతుంది. ఈ నేపథ్యంలో తమ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా బీఎల్‌వోలతో పరిశీలన చేయించి పరిష్కరించాలని పట్టభద్రులు కోరుతున్నారు. ఒకవేళ దరఖాస్తులో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకొని మరోసారి అప్లై చేసుకోవడానికి అవకాశం ఉంటుం దని, చివరి నిమిషం వరకు తేల్చకుండా నాన్చితే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.



సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో పెండింగ్ చూపిస్తున్న ఎమ్మెల్సీ ఓటర్ల అప్లికేషన్



గుంటూరు అరండల్‌పేట ఆర్వోబీకి కేంద్రం అధికారిక ఆమోదం

- ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఉత్తర్వుల జారీ
- సేతు బంధన్ పథకం కింద మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటన
- రెండేళ్లలో పూర్తి చేయాలని ఆదేశం

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని అరండల్‌పేట ఆర్‌వోబీ నాలుగు లేన్ల విస్తరణ - నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఆర్ఐఎఫ్ పథకం కింద సేతు బంధన్ పథకం ద్వారా గుంటూరు - నల్లపాడు రైల్వే సెక్షన్ పరిధిలోని ఈ ఆర్వోబీ నిర్మాణానికి రూ.98 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా ఆదేశాలను బుధవారం జారీ చేసింది. ఏపీ రోడ్, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సింగ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్లలో ఈ బ్రిడ్జీ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో గుంటూరు పార్లమెంటు పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 3 - 4 రోజుల్లో వెలువడుతుందనుకున్న కేంద్ర ప్రభుత్వ జీవో ముందుగానే రావడంతో గుంటూరు ప్రజలు ఆనందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారిక ప్రకటనను విడుదల చేయడంపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు, అమరావతి అభివృద్ధి కోసం పాటుపడే కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఈ తరహా విజయాలు సాధ్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు.

24 నుంచి ఏఎన్‌యూ యూత్ ఫెస్టివల్స్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ యూత్ ఫెస్టివల్స్ ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు యూత్ ఫెస్టివల్స్ 2024 కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ మురళీమోహన్ బుధవారం తెలిపారు. యూత్ ఫెస్టివల్స్ కు సంబంధించి అన్ని కళాశాలలకు సమాచారం పంపామని పేర్కొన్నారు. మ్యూజిక్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్, క్విజ్ , లిటరరీ ఈవెంట్స్ అంశాలలో విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, సాంస్కృతిక పోటీలలో ప్రతిభను ప్రదర్శించేందుకు యూత్ ఫెస్టివల్స్ ఒక వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. యూత్ ఫెస్టివల్స్ కు అడిషనల్ కోఆర్డినేటర్ గా ప్రొఫెసర్ పి .జాన్సన్ వ్యవహరిస్తారని మురళీమోహన్ తెలిపారు.

ప్రారంభమైన ఫార్మసీ పరీక్షలు

పెదకాకాని, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ పరీక్షలు బుధవారం సజావుగా ప్రారంభమయ్యాయని పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆయా విభాగాధిపతులను అడిగీ తెలుసుకున్నారు. పరీక్ష రోజే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షల పకడ్బందీగా నిర్వహించేందుకు అబ్జర్వర్లను, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు.

8న చదరంగం పోటీలకు ఎంపికలు

గుంటూరు(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 గుంటూరు చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అండర్ 14, 17 బాల బాలికలకు చదరంగం పోటీలు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గలోన్ని స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చుని తెలిపారు. ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. విద్యార్థులు పాఠశాలల నుంచి వయసు ధృవీకరణ పత్రం, ఆదార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఎంపికలకు రావాలని సూచించారు.

గుంటూరు క్లబ్ విషయంలో... హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్లబ్బులలో పేకాట విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పాటించాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా రిక్రియేషన్ క్లబ్బులను ప్రారంభించిన విషయం విదితమే. దీనిలో భాగంగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా రిక్రియేషన్ క్లబ్‌లను పోలీసులు మూయించారు. 13 ముక్కల రమ్మీ ఆట జూదం కిందకి రాదని, దానికి గతంలోనే చట్టబద్ధత కల్పించారు. ఈ విషయమై గతంలో సుప్రీంకోర్టు కూడా క్లబ్‌లలో 13 ముక్కల రమ్మీ ఆడుకోవచ్చని తీర్పు ఇచ్చింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో 13 ముక్కల రమ్మీని కూడా జూదం కింద చేరుస్తూ నిషేధించింది. దీన్ని అనుసరించే జిల్లాలోని క్లబ్బులను పోలీసులు మూయించారు. ఈ నేపథ్యంలో గుంటూరు క్లబ్‌లో 13 ముక్కల రమ్మీ ఆటను నిలిపివేయాలంటూ నల్లపాడు పోలీసులు క్లబ్బును మూయించారు. దీంతో క్లబ్ కార్యదర్శి నల్లమోతు సాంబశివరావు హైకోర్టును ఆశ్రయించారు. క్లబ్ తరఫున హైకోర్టు సీనియర్ న్యాయవాది వలేటి లక్ష్మీనారాయణ తన వాదనలు వినిపించారు. 13 ముక్కల రమ్మీ జూదం కాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాటించాలని హైకోర్టు స్పష్టం చేస్తూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసును వచ్చే వారానికి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గురువారం నుంచి క్లబ్ లో 13 ముక్కల రమ్మీ ఆడుకోవడానికి మార్గం సుగమం అయిందని న్యాయవాది లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు.

కొత్త మద్యం దుకాణాల వద్ద కోలాహలం

గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దయిపోయి.... ప్రైవేటు మద్యం దుకాణాలు అమల్లోకి వచ్చాయి. అయితే బుధవారం మధ్యాహ్నం వరకు సరిగా మద్యం సరఫరా జరగలేదు. మధ్యాహ్నం రెండు గంటల లోపు మద్యం ఆయా షాపులకు చేరుకోకపోవడంతో మద్యం బాబులు నిరాశ వ్యక్తం చేశారు. ఎప్పుడు మద్యం వస్తుందని మద్యం బాబులు ఎంతగానో ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. సాయంత్రానికి కొన్ని షాపులకు మద్య చేరుకోవడంతో పరుగులు పడితే వెళ్లి, క్యూలైన్లో నిలబడి మద్యాన్ని కొనుగోలు చేశారు. సాయంత్రం వేళలో ఆయా మద్యం దుకాణాల వద్ద కొనుగోలుదారుల కోలాహలాం నెలకొంది.



గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

నైపుణ్య గణన సర్వే వేగవంతం

● ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా


కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన నైపుణ్య గణన సర్వేను వేగవంతంగా నిర్వ హిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. నైపుణ్య గణనను సెప్టెంబరు 30న ప్రారంభించామన్నారు. పైలట్ ప్రాజెక్టు సర్వేలో వచ్చిన అంశాల ప్రకారం సర్వేను మరింత మెరుగ్గా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సర్వే కోసం నియోజకవర్గంలోని సచివాలయ ఉద్యోగులు, నగరపాలక సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి ఎన్యుమరేటర్లుగా నియమించామన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ రూపొందించిన యాప్ ద్వారా ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల నైపుణ్య వివరాలను నమోదు చేస్తున్నారని, యాప్‌లో నమోదు చేసిన వివరాలను నిర్ధారించేందుకు ఆధార్ ఆధారిత ఓటీపీ వస్తుందని, ఓటీపీ నెంబరు చెప్పేందుకు ప్రజలు సంకోచించాల్సిన అవసరంలేదని వెల్లడించారు. నైపుణ్య గణన సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు అవసరమైన వివరాలను అందించి సర్వే త్వరగా పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని కోరారు.

25లోపు స్కిల్ సర్వేను పూర్తి చేయాలి

● ఎంపీడీవో, సీఆర్డీఏ సోషల్ వెల్ఫేర్ అధికారులు


పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శిల్పా

తుళ్లూరు , అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ గణాంకాలు (స్కిల్ సర్వే) ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని తుళ్లూరు ఎంపీడీవో శిల్పా కానూరి, సీఆర్డీఏ సోషల్ డిప్యూటీ డైరెక్టర్ బొర్రా శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ రఘు అన్నారు. బుధవారం తుళ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాదర్శులు, సచివాలయ సిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు. తుళ్లూరు, మంగళగిరి , దుగ్గిరాల మండలాల్లో అధికారులు నైపుణ్య గణాంకాలు సేకరిస్తున్న విషయం తెలిసిందే. తుళ్లూరు మండలంలో 42శాతం గణాంకాల నమోదు పూర్తయిందని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న వారు స్కిల్ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శిల్పా ఆదేశించారు. గ్రామాల్లో ఏయే నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందో ప్రజల నుంచి ముఖ్యంగా యువత, మహిళల నుంచి వివరాలు నమోదు చేసుకోవాలని రఘు, శ్రీనివాసరావులు సూచించారు. అలాగే గ్రామాలలో తాగు నీరు, డ్రెయినేజీ, రోడ్ల వ్యవస్థ ఎలా ఉందో ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదికలు ఇస్తూ ఉండాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేష్మా, ఈవోపీఆర్డీ ప్రభాకర్ సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఆర్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన

మంగళగిరి సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హార్ట్ రీస్టార్ట్ డే సందర్భంగా మంగళగిరి ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎయిమ్స్ వైద్య బృందం హాజరై హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు అందించవలసిన ప్రథమ చికిత్సను గురించి విద్యార్థులకు వివరించారు. సీపీఆర్ ప్రక్రియను ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఫ్యామిలీ మెడిసిన్ వైద్యులు రాజేష్ నాయక్, డాక్టర్ సత్యానందన్, ఫీల్డ్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, హైస్కూల్ ప్రతినిధులు శింధె బాలకృష్ణ, సరళ కుమారి, డోలాక్షి, రామ్‌చంద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యకాస జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈ నెల 28వ తేదీన దుగ్గిరాల పసుపు అసోసియేషన్ హాల్లో జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశ కరపత్రాలను బుధవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యార్లగడ్డ శివయ్య, గుర్రంకొండ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆరా


పుసులూరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెదనందిపాడు, అక్టోబరు, 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పుసులూరు, పెదనందిపాడు గ్రామాల్లో బుధవారం కేంద్రబృందం పర్యటించారు. ఆయా సచివాలయాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వినియోగం, జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఉపాధిహామీ పనులు, డ్వాక్రా రుణాలు పంపిణీ వంటి అంశాలపై ఎస్ఎల్ఎంటీ అధికారులు సురేంద్రనాథ్, అశోక్‌స్వాహాలు విచారణ చేపట్టారు. వారి వెంట డీఆర్‌డీఏ లైజనింగ్ అధికారి ఇస్మాయిల్ ఉన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన

తుళ్లూరు, అక్టోబరు 16: స్థానిక కేవీఆర్ జడ్పీ హైస్కూల్లో బుధవారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్ప్‌లైన్ సేవలు, బాల్య వివాహాలు.. అనర్థాలు, బాలల అక్రమ రవాణా గురించి విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు 1098 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ చిన్న కోటేశ్వరావు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో కదలిక

పెదనందిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు రహదారిలో పెదనందిపాడులో ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకు ఉన్న భారీ గోతులకు బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై పడిన భారీ గుంతలను పొక్లెయిన్‌తో పూడ్చివేసి, చదును చేశారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, నిధులు మంజూరుకాగానే పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది.

19నుంచి శ్రీగంగానమ్మ దేవతా ఉత్సవాలు

దుగ్గిరాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలువూరులో ఈనెల 19 నుంచి 21వతేదీ వరకూ శ్రీగంగానమ్మదేవతా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు బుధవారం తెలిపారు. పుష్కరకాలంగా బయోఫర్ సీఈవో డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సౌజన్యంతో జరుగుతున్న ఉత్స వాల్లో భాగంగా, దేవస్థానం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, 19వతేదీ శనివారం ఉదయం 8గంటలకు శ్రీసూక్తమహాభిషేకము, సాయంత్రం 6గంటలకు దీపాలంకరణ మహోత్సవం జరుపనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు చర్యలు

పెదనందిపాడు, అక్టోబరు, 16(ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు రైతులు చర్యలు చేపట్టాలని ఏవో సుధారాణి అన్నారు. మండలపరిధిలోని అన్నవరం, ఉప్పలపాడుల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందును అందజేశారు.

సమస్యల వలయంలో ప్రత్తిపాడు బస్టాండు

● నెల రోజులుగా విద్యుత్ సరఫరా లేక అంధకారంలో
● పిచ్చి మొక్కలతో, వర్షపునీటితో నిండిన ఆవరణ
● బయటే ఆగుతున్న బస్సులు
● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన తీరు



ప్రత్తిపాడు బస్టాండు

ప్రత్తిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ప్రత్తిపాడులోని బస్టాండు సమస్యల వలయంలో కూరుకుని ఉంది. ప్రయాణికులు లోపలకు అడుగు పెట్టడానికి గానీ, బస్సులు బస్టాండ్ ఆవరణలోనికి వెళ్లడానికి గాని వీల్లేని పరిస్థితుల్లో ఉంది. రాష్ట్రం విడిపోయి అమరావతి రాజధానిగా ఏర్పడిన తరువాత అప్పటి ప్రభుత్వం బస్‌స్టేషన్‌లను సర్వాంగ సుందరంగా తయారు చేసింది. అయితే గత ప్రభుత్వంలో బస్టాండ్‌ను గురించి పట్టించుకోకపోవడంతో స్వరూపమే మారిపోయింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. బస్సులు సైతం లోపలకు వెళ్లకుండా రోడ్డు పైనే ఆపి అక్కడే ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం వంటివి చేస్తున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్తిపాడు బస్టాండ్ గురించి ఆర్టీసీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బస్టాండ్ ఆవరణ మొత్తం పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో పాటు చినకులు పడితే నీరు లోపల నిలిచిపోతుంది. ఆ నిలిచిన నీరు బయటకు వచ్చే మార్గమే లేకుండా పోయింది. బస్టాండ్ ఆవరణలో దుకాణాలను అద్దెకు తీసుకున్న వారు గతంలో అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు చేయడం, గుంటూరు డిపో 1 మేనేజర్ వచ్చి ఇక్కడ చూసి వెళ్లడం అనేక మార్లు షరామాములుగా జరిగిపోయింది. దుకాణదారులు ప్రయాణికులు లోపలకు వచ్చే మార్గంలో మట్టి పోయించి ఇబ్బందులు లేకుండా చేశారు. అయితే బస్టాండ్ ఆవరణ మొత్తం లోతట్టులో ఉండటంతో పాటు నీరు బయటకు వెళ్లే మార్గం ఆర్టీసీ అధికారులు చేయలేక పోయారు. అంతే కాకుండా బస్టాండ్ ఆవరణ ఉన్న బారుకి ప్రధాన రహదారిపై ఉన్న సైడ్ కాలువలు సైతం పూర్తిగా పోడిపోయాయి. గతంలో పంచాయతీ అధికారులు ఆర్టీసీ అధికారులను కోరినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. దీంతో ప్రధాన రహదారిపై నీరు నిలిచి రోడ్డు మొత్తం గుంతలమయంగా మారుతుంది.


పిచ్చి మొక్కలతో, నీరు నిలిచి ఉన్న బస్టాండ్ ఆవరణ

అసాంఘిక కార్యకలాపాలు

ఇదిలా ఉంటే బస్టాండ్ ఆవరణలో కరెంటు లేకపోవడంతో పాటు కొన్ని సంవత్సరాలుగా అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. దీంతో బస్టాండ్‌ని ఎవరి ఇష్టం వచ్చినట్లుగా వారు ఉపయోగించుకుంటున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


పల్లె పండుగలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమం బుధవారం మండలంలోని కొర్నెపాడు, ఇంజనంపాడు గ్రామాల్లో పండుగ వాతావరణంలో ఆర్భాటంగా నిర్వహించారు. గత ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా విస్మరించారని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించాయన్నారు. ప్రజలు గ్రామసభల ద్వారా నిర్ణయించిన అభివృద్ధి పనులను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో అనుసంధానం చేయటం, నిధులు మంజూరు కావటం హర్షణీయం అన్నారు. అలాగే కొర్నెపాడులో రూ.10 లక్షల వ్యయంతో మూడు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అలాగే ఇంజనంపాడు గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించబోయే పనులకు ఎమ్మెల్యే రామాంజనేయులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, కొర్నెపాడు అధ్యక్షుడు అమవాస్య సీతా రామరాజు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట శివకృష్ణ, తెలుగుయువత అధ్యక్షుడు నాగిశెట్టి నాగరాజు, అనంతవరప్పాడు సర్పంచ్ దారా వెంకటరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, వింజనంపాడు అధ్యక్షుడు కోయ గంగాధర్, సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నార్నె సుజాత, మాజీ సర్పంచ్ గుంటుపల్లి చింపెరయ్య, మాజీ ఎంపీటీసీ నార్నె సాంబశివరావు, గుంటుపల్లి కిరణ్‌కుమార్, పరిటాల హరిబాబు, డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ అధికారి టీవీ విజయలక్ష్మి, ఎంపీడీవో రమేష్‌బాబు, పీఆర్ ఏఈ కిషోర్‌బాబు, విద్యుత్‌శాఖ ఏఈ రవితేజ, హౌసింగ్ ఏఈ బాబూరావు, ఏపీఎం పాల్గొన్నారు.

వరద నష్టం జాబితాపై అధికారుల విచారణ

● రైతుల వివరాలు, భూముల పరిశీలన


రైతుల జాబితాపై సిరిపురంలో విచారణ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

మేడికొండూరు అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత నెలలో సంభవించిన వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు వరద సాయం అందిన విషయం తెలిసిందే. అయితే లబ్ధిదారు జాబితాపై విచారణ జరిపి అక్రమాలు వెలికితీయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు కలెక్టర్ విచారణ ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం అధికారులు నాలుగు గ్రామాలలో విచారణ చేపట్టారు.

మూడు బృందాలుగా విచారణ: మేడికొండూరు మండలంలో సిరిపురం, మేడికొండూరు, వెలవర్తిపాడు, మందపాడు, పొట్లపాడు, వరగాని, కొర్రపాడు, పాలడుగు గ్రామాల్లో అధికారులు మూడు బృందాలుగా విచారణ చేపట్టారు. వరదలకు ఎంతమంది రైతులు నష్టపోయారు, వారు సాగు చేసిన భూమి విస్తీర్ణం, అందులో పత్తి సాగు చేశారా లేదా అనే వివరాలతో పాటు కౌలు రైతు కార్డులను పరిశీలించారు. గుంటూరు, పొన్నూరు ఏడీఏలు తిరుమలాదేవి, రామకోటేశ్వరి, ఎస్‌టీఎల్ అధికారి అన్నపూర్ణ, డీసీఎల్ అధికారి సునీతా, మేడికొండూరు తహసీల్దార్ కళ్యాణి తదితరులు రైతులను విచారించడంతో పాటు భూములను కూడా పరిశీలిస్తున్నారు. రెండు రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో గురువారం సాయంత్రానికి విచారణ పూర్తి చేయనున్నట్లు విచారణ అధికారులు తెలిపారు.

అదనపుకట్నం కోసం వేధిస్తున్నాడని భర్తపై ఫిర్యాదు

దుగ్గిరాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దుగ్గిరాల పోలీ సులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈమనికి చెందిన చావలి దర్శికీర్తికి, తుళ్లూరుకు చెందిన అమరదీప్‌తో ఏడాది క్రితం వివాహమైంది. కాగా కొద్ది నెలలుగా భర్త అమర్‌దీప్‌తో పాటు, అత్త ప్రమీలారాణి తన పుట్టింటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొనింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరవి తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 516 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 16: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 516 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువ కు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి పశ్చిమకాల్వకు 27 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 68 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 100 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

154 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, అక్టోబరు 16: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 154 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,700, గరిష్ఠ ధర రూ.12,500, మోడల్‌ధర రూ.11,511 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,700, గరిష్ఠధర రూ.12,500, మోడల్‌ధర రూ.11,511 పలికాయి.

సర్వేయరుగా శ్రీనివాసరావు

పెదనందిపాడు, అక్టోబరు, 16(ఆంధ్రజ్యోతి) : మండల సర్వేయరుగా టి.శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అమరావతి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రసాదరావు బదిలీపై చిలకలూరిటపేట మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా సర్వేయరు శ్రీనివాసరావు మాట్లాడుతూ భూసంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

కాకుమాను, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన ఈదులమూడి శిరీష చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్(లాం) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అస్సాంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సిల్చార్(నిట్) నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ (డాక్టరేట్) పొందారు. డాక్టరేట్ పొందిన శిరీషను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

గుండాలపాడు వాసికి పీహెచ్‌డీ

ఫిరంగిపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలపాడు గ్రామానికి చెందిన మల్లాది కోటేశ్వరరావుని పీహెచ్‌డీ వరించింది. హైకోర్టు అడ్వకేట్‌గా పని చేస్తున్న మల్లాది కోటేశ్వరరావు 'సోషల్ సెక్యూరిటీ ఫర్ అగ్రికల్చరల్ వర్కర్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఇట్ రెఫరెన్స్ టూ సోషల్ సెక్యూరిటీ స్కీమ్ అండ్ ఎన్‌జీఎన్ఆర్ ఈజీ యాక్ట్ 2005' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించగా నాగార్జున యూనివర్సిటీ అతడికి పీహెచ్‌డీని ప్రకటించింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావును జిల్లా సర్పంచుల సంఘం కార్యదర్శి పెదబాబు, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచ్ దాసయ్య, టీడీపీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

కొండపాటూరులో విజిలెన్స్ సోదాలు

కాకుమాను, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరులోని ఓ రేషన్ షాపు(0747030) విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించారు. సోదాలు నిర్వహించి 888 కేజీల బియ్యం, 40 కిలోల కందిపప్పు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్ షాపు దుకాణదారుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. అదనంగా ఉన్న బియ్యాన్ని, కందిపప్పును ఆర్ఐ ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు బుధవారం అందజేశారు.

స్వర్ణకారుల కల నెరవేర్చిన మంత్రి నారా లోకేశ్

● ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
● హర్షం వ్యక్తం చేస్తున్న స్వర్ణకార వృత్తిదారులు


కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్న స్వర్ణకార సంఘాల నేతలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు ఏపీ కేబినెట్ బుధవా రం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ కృషితో స్వర్ణకార కార్పొరేషన్ కల సాకారమైందని స్వర్ణకార వృత్తిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిలో స్వర్ణకార వృత్తిదారుల సాదకబాధకాలను స్వయంగా తెలుసుకున్నారు. దీంతో పాటు యువగళం పాదయాత్రలో రాష్ట్రమంతా పర్యటించిన ఆయన స్వర్ణకారుల జీవన స్థితిగతులను అధ్యయనం చేశారు. స్వర్ణకార వృత్తిదారులకు ప్రత్యేక కార్పొ రేషన్ అవసరమని భావించారు. అలాగే, మంగళగిరిలో శ్రీ లక్ష్మీ నరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించి పేద స్వర్ణకారులకు వృత్తిపరమైన పని ముట్లు, ఉపకరణాలను అందజేసి చేయూతనందించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్నెల్లలో స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇచ్చిన హామీని తూ.చ తప్పకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలపడంపై స్వర్ణకార సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. శ్రీలక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో బుధవారం షరాబ్ బజారు నుంచి మెయిన్ బజారు మీదుగా దేవస్థానం వరకు ర్యాలీ నిర్వహించారు. బాణా సంచాకాల్చి, మిఠాయిలు పంచుకుని వేడుకలు జరుపుకున్నారు. నృసింహాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుతో రాష్ట్ర వ్యాప్తంగా వున్న పది లక్షల మంది స్వర్ణకారులకు మేలు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని స్వర్ణకార సంఘాల తరపున మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, స్వర్ణకార సంఘాల నేతలు పడవల మహేష్, జగ్గారపు రామ్మోహనరావు, ఆకురాతి నాగేంద్రం, జొన్నాదుల బాలకృష్ణ, దామర్ల మోహన్, కారంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి సీసీ రోడ్లు పూర్తి చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి


మోతడకలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నాటికి గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిడుముక్కల, లచ్చన్నగుడిపూడి, ముక్కామల, మోతడక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆమె శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.75 లక్షల ఉపాధి నిధులు కేటాయించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు తప్పనిసరిగా పనుల్లో నాణ్యతను పాటించాలని కోరారు.

పంచాయతీలను పునర్జీవింపచేస్తున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

పంచాయతీలను పునర్జీవింప చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మోతడక గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, రూ.4 లక్షల నిధులతో అగ్రికల్చర్ గోడౌన్ మరమ్మతులు, ఎస్సీకాలనీలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, దాత జంబుల సుబ్బారావు రూ.7 లక్షల ఆర్థిక సాయంతో బీసీ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల నిమిత్తం తాడికొండ మండలానికి రూ.75 లక్షలు, ఫిరంగిపురం మండలానికి రూ.75 లక్షలు, మేడికొండూరు మండలానికి రూ.75 లక్షలు, తుళ్లూరు మండలానికి రూ.75 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వీ.శంకర్, సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, ఎంపీటీసీ కంచర్ల సాంబశివరావు, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ యడ్లపల్లి సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేతపూడి విజయ్‌శేఖర్, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూధనరావు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు చిగురుపాటి అనూఫ్, బీసీ సెల్ అధ్యక్షుడు నీలాల కృష్ణారావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డిపాటి సాంబశివరావు, షేక్ సుభాని, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరుకలపూడి, మోరంపూడి గ్రామాల్లో పల్లెపండుగ


పేరుకలపూడిలో రోడ్ల శంకుస్థాపనలో పాల్గొన్న టీడీపీ మండల అధ్యక్షురాలు శ్రీఅనిత, వైస్ ఎంపీపీ సాయిచైతన్య, ఎంపీటీసీ అశోక్, ఎంపీడీవో తదితరులు

దుగ్గిరాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మండలంలోని పేరుకలపూడి, మోరంపూడి గ్రామాల్లో పల్లెపండుగను బుధవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మూడో రోజు రెండు గ్రామాల్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పేరుకలపూడిలో 30 లక్షలతో ఎనిమిది అభివృద్ధి పనులకు, మోరంపూడిలో రూ.15 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు, భూమిపూజ నిర్వహించారు. పంచాయతీరాజ్ డీఈ గుప్త, ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ టీ గోవర్ధనరావు, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ తాళ్ల అశోక్‌యాదవ్, మోరంపూడి గ్రామసర్పంచ్ ఇత్తడి రమేష్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, పురం శ్రీనివాస్, గోగం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు స్టోన్‌క్రషర్స్ యాజమాన్యం సాయం


ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలసి వరద బాధితులకు చెక్కును అందజేసిన స్టోన్ క్రషర్ యూనియన్ నాయకులు

మేడికొండూరు అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా స్టోన్ క్రషర్ ఓనర్స్ అసోసియేషన్ వారు వరద బాధితులకు రూ.16 లక్షలు ప్రకటించగా బుధవారం నగదు చెక్కును ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. శ్రావణ్‌కుమార్ సూచన మేరకు స్టోన్ క్రషర్ యూనియన్ నేతలు స్పందించి ఈ సాయం అందజేశారు. కార్యక్రమంలో స్టోన్ క్రషర్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీకే రవికుమార్, కార్యదర్శి వీ శివకుమార్, నాయకులు పాములపాటి శివన్నారాయణ, పి. వెంకటేశ్వరరావు, ఎస్ నాగేశ్వరరావు, పి.అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు కార్మికుల సమస్యను పరిష్కరించాలి

● ఖాళీ కంచాలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సిమెంటు కంపెనీ కార్మికులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సిమెంటు కంపెనీ కార్మికుల సమస్యను మంత్రి లోకేశ్ పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు వై నేతాజీ కోరారు. బుధవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సిమెంటు కంపెనీ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సిమెంటు కార్మికుల యానియన్ ఆధ్వర్యంలో ఖాళీ కంచాలతో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ 1993లో ఏసీసీ యాజమాన్యం సిమెంటు ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేసిందని 40 ఏళ్లుగా కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని ఆందోళనలు, నిరసనలు చేపట్టినప్పటికీ పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కలెక్టర్, కోర్టు ఆదేశాలు కూడా పట్టించుకోలేదని, ఈ 40 ఏళ్లలో సుమారు 15 మంది కార్మికులు మానసిక ఆందోళన, అనారోగ్యంతో చనిపోయారన్నారు. కంపెనీ భూములను అనధికారికంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని యూనియన్ నేత స్టీవెన్ ఆరోపించారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ టీఎన్‌టీయూసీ ప్రతినిధులు పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నేతలు బూరగ వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి, వెంకటరెడ్డి, తుడిమిల్ల వెంకటయ్య, కూరపాటి కోటయ్య, స్టీవెన్, నాగేశ్వరరావు, బాషా, శారద, ఆదినారాయణ, యెహోషువ, ప్రభాకర్, దుర్గారావు, సాంబయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సమస్యలపై 22న సదస్సు

తాడేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యలపై విజయవాడలోని ఎంబీవీకేలో 22న రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్ అన్నారు. బుధవారం రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ సమావేశం ఉండవల్లి సెంటర్ ప్రజాసంఘాల కార్యాలయంలో దాసరి గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ఈ సదస్సులో కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్, ఏఐకేఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణ, విద్యుత్ రంగ నిపుణులు డాక్టర్ కె.అశోక్‌రావు, ఇరిగేషన్ విశ్రాంత సీఈ ఎం వెంకటేశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. పలు ప్రధాన అంశాలపై వక్తలు ఉపన్యసిస్తారని ఈ సదస్సుకు రైతులు, రైతు ఉద్యమ శ్రేయోభిలాషులు హాజరు కావాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నవంబరు 6తో ముగియనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు ఆరుతో ముగియనుందని పురపాలక సంఘ కమిషనర్ శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాలతో 2021 సంవత్సరంలోపు డిగ్రీ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైనులోగాని, ఆన్‌లైనులోగాని తమ ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను పురపాలక సంఘ కార్యాలయంలో గాని, మండల తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. 2025 సంవత్సరంలో నిర్వహించే కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమెల్సీ ఎన్నికలలో అర్హత కల్గిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం నిర్వహించనున్నామని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగగా జరుపుతున్నామన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వాల్మీకి మహర్షి జయంతి నిర్వహిస్తామని అన్నారు.

నందూరు సర్పంచ్ నాగరాజు మృతి


అక్కి నాగరాజు (ఫైల్)

పొన్నూరుటౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందూరు గ్రామానికి చెందిన సర్పంచ్ అక్కి నాగరాజు మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నాగరాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాగరాజు మృతదేహాన్ని బుధవారం వైసీపీ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ సైపుల్లా, షేక్ నాజర్, మహ్మద్ మామ, పలు గ్రామాల సర్పంచ్‌లు చుండూరు వీరయ్య, తిరుపతిరావు, గాంధీ, సుబ్బారావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శతాధిక వృద్ధుడు మృతి


శేషిరెడ్డి (ఫైల్)

కొల్లిపర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మున్నంగిలో 104 సంవత్సరాలు కలిగిన ఆళ్ళ శేషిరెడ్డి అనే వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. శేషిరెడ్డికి ఒక కొడుకు, ఒక కుమార్తెతో పాటు మనమళ్లు, మనమరాళ్లు, ముదిమనవలు ఉన్నారు. ఆయన ఐదు తరాలకు చెందిన పిల్లలను చూశారు.

అధ్వానంగా పొన్నూరు-చందోలు రహదారి

- 5.6 కిలోమీటర్లకు రూ.8 కోట్లు మంజూరు
- నిధులు లేక నిలిచిన రహదారి నిర్మాణం
- అడుగుకో గుంత, గజానికో గొయ్యితో అవస్థలు

పొన్నూరుటౌన్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు నుంచి చందోలు వెళ్లే ప్రధాని రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహన దారులకు తీవ్ర అవస్థలు ఏర్పడుతున్నాయి. ఈ రహదారిలో గజానికో గొయ్యి, అడుగుకో గుంతతో ప్రయాణం నరకయాతనను తలపిస్తుంది. పొన్నూరు పట్టణ శివారు నుంచి సంగుపాలెంకోడూరు మీదుగా చందోలు వెళ్లటానికి 6.8 కిలో మీటర్లు ఉండగా 5.6 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ఐదేళ్ల క్రితమే నేషనల్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి రూ.8 కోట్లు మంజూరయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు ఈ రహదారి నిర్మాణంపై దృష్టి సారించకపోవటంతో రహదారి నిర్మాణం అటకెక్కింది. ఈ మార్గం నుంచే రేపల్లె, నిజాంపట్నం, కృష్ణ జిల్లాలోని నాగాయలంక వంటి ప్రాంతాలకు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తుంటాయి. వర్షం పడిందంటే ఈ రోడ్డుపై ప్రయాణం దారుణంగా ఉంటుంది. వర్షంతో ఈ రహదారిపై ఉన్న గుంతలు అన్ని నీటితో నిండిపోవటంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో ఆగి వెతుక్కునే పరిస్థితి ఉంది.

గుంతలో ద్విచక్ర వాహనాలు పడిపోయి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి ప్రధాన రహదారి కావటం, చందోలులోని ప్రముఖ పుణ్యక్షేత్రం బంగళాముఖి ఆలయం ఉండటం, చందోలులో భారీ వస్త్ర పరిశ్రమ ఉండటంతో ఈ రహదారి ఎప్పుడు రద్దీగానే ఉంటుంది. ప్రయాణికులు, వాహన దారుల అస్థలు చూసైనా ప్రభుత్వం స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని ప్రారంభించాలని పలు గ్రామాల వాసులు వేడుకుంటున్నారు.



భారీ గుంతలతో దర్శనమిస్తున్న చందోలు-పొన్నూరు రహదారి

తెనాలిని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుకుందాం

● మంత్రి మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో తెనాలి ప్రాంతాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని ఆటోనగర్ బీఎస్‌ఆర్ పవర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల తయారీని బుధవారం మంత్రి మనోహర్ పరిశీలించారు. నిర్వాహకులు తయారీ విధానం, ట్రాన్స్‌పోర్ట్ వివరాలను మనోహర్‌కు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ల తయారీని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్


రతన్‌టాటా విగ్రహ తయారీదారులతో మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రపంచం గర్వించే రతన్‌టాటా

తెనాలి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగిన మహోన్నత వ్యక్తి రతన్‌టాటా అని, ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి కాటూరి శిల్పశాలలో రూపుదిద్దిన టాటా విగ్రహాన్ని బుధవారం మంత్రి పరిశీలించారు. గుజరాత్‌లోని సూరత్, కర్ణాటకలోని మైసూర్‌లో ప్రతిష్ఠించేందుకు ఇక్కడ విగ్రహాలు తయారు చేశామని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నో పరిశ్రమలు స్థాపించి కోట్ల మందికి ఉపాధి ఇవ్వడమే కాకుండా దేశానికి క్రమం తప్పకుండా రూ.కోట్ల పన్నులు చెల్లిస్తూ ఆయన ఆదర్శంగా నిలిచారని చెప్పారు. దేశానికి అవసరమైతే తన యావదాస్తిని ఇస్తానన్న టాటా మహానుభావుడన్నారు. అమరావతిలో ఆయన స్ఫూర్తితో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కాటూరి రవిచంద్ర, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించటమే లక్ష్యం

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్ని ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చేబ్రోలు మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు గ్రామాలలో రహదారుల నిర్మాణానికి నరేంద్ర కుమార్ శంకుస్థాపన చేసారు. చేబ్రోలు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే రహదారులు, గొడవర్రు గ్రామంలో రూ.5 లక్షలు, గుండవరం గ్రామంలో రూ.3 లక్షలు, నారాకోడూరు గ్రామంలో రూ.10 లక్షలు, వడ్లమూడి గ్రామంలో రూ.10 లక్షలు మొత్తం రూ.72 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, మంచి నీటి బోర్ల నిర్మాణానికి నరేంద్ర కుమార్ కూటమి పార్టీల నాయకులతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభల్లో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాలాభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఆగిపోయిన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకే పల్లెపండుగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలకు గ్రామాలలో రైతులు పెద్ద ఎత్తున పంట నష్టపోతే నెల రోజులు తిరగకుండానే రైతులకు నష్టపరిహారం వారి ఖాతాలో జమ చేసినట్లు గుర్తు చేసారు. హెక్టారుకు రూ.25 వేలు పరిహారంగా అందించామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చేబ్రోలులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మార్కండేయ బాబు

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : బొర్రు

పొన్నూరుటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ పార్లమెంట్ విభాగం రైతు ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోళ్లమూడిపాడు, జూపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు జరిగాయి. పచ్చలతాడిపర్రులో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, జూపూడి గ్రామంలో రూ. 2.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, గోళ్లమూడిపాడులో రూ.3.50 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేసారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ పల్లెపండుగ తొలివిడత కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాలతో మండలంలో రూ. కోటి వ్యయంతో రహదారులు, సైడ్ డ్రయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు మొవ్వ వెంకటకృష్ణ, స్థానిక నాయకులు వెంకట కృష్ణ, ఉప్పాల సాంబశివరావు, నాగేశ్వరరావు, సురేష్, కల్లూరి కోటేశ్వరరావు, రత్నమోహన్, వేజండ్ల సాంబ్రాజ్యం, సూరిబాబు, యలవర్తి శేషగిరిరావు, యంపరాల గోపి, విజయ్ కుమార్, మున్నంగి సుబ్బారెడ్డి, గరిగంటి సాయిబాబు, చిలకా రవి తదితరులు పాల్గొన్నారు.


గోళ్లమూడిపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

వీవీఐటీలో ఎక్సోషియా-2కే24 సాంకేతిక సదస్సు

పెదకాకాని, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ఎక్సోషియా 2కే 24ను ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఏపి స్టేట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ బుధవారం ప్రారంభించారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సదస్సులో బ్రైండ్ ఫోటి డెడ్ సర్క్యూట్, సిగ్నల్ షపుల్, మిస్టరీ మ్యాచ్, ప్రాజెక్ట్ ఎక్స్ పో సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవకుమార్ మాట్లాడుతూ విద్యార్థి విభాగాలలో సభ్యులు కావడం, సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవడుతాయని అన్నారు. సాంకేతిక సదస్సులలో విజేతలుగా నిలవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను దక్కించుకోవచ్చని తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటి ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి ఏవీ నరేష్ బాబు, సంధానకర్త సీహెచ్ నాగసాయి కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వల చేస్తున్న దేవకుమార్

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి : ఎంఈవో

కొల్లిపర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మండల కేంద్రం కొల్లిపర భవిత కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ డిస్లెక్సియా వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. సాల్మన్‌రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వలన వారిలో నైపుణ్యాలు అభివృద్ధిపర్చవచ్చునన్నారు. పిల్లల్లో పెరుగుదల లోపం ఉన్నా, బుద్ధి మాంద్యత ఉన్నా వెంటనే వైద్య సలహాను తీసుకోవడం మంచిదన్నారు. అంతేకాకుండా ఫిజియోథెరపీ ద్వారా శారీరక అవయవాల లోపాలను కొంత మేర మెరుగుపర్చవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు మృత్యుంజయరావు, ఉపాధ్యాయులు కరీమూన్ నూర్జహాన్, సురేష్, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.



ప్రపంచ డిస్లెక్సియా కార్యక్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఐటీఐల జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఐటీఐలు, డీఎల్‌టీసీల జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం తెనాలి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించారు. 2024-27 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీని ఎన్నికల అధికారులు భీమారావు, రమేష్‌బాబు, పరిశీలకులు శ్రీనివాస్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా రావి చిన్నవెంకటేశ్వర్లు, కార్యదర్శిగా అమృతలూరి యోబు, కోశాధికారిగా షేక్ మాలంబి, ఉపాధ్యక్షులుగా శేఖర్‌బాబు, బాలాజీ, సంయుక్త కార్యదర్శులుగా గద్దె వెంకటేశ్వరరావు, విజయప్రసాద్, సభ్యులుగా ప్రకాష్‌బాబు, శివ అప్పారావు, పద్మజ, బొద్దు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

వైకుంఠపురం ఆలయ హుండీల ఆదాయం రూ.32.90 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

తెనాలి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురం ఆలయానికి హుండీ ల ద్వారా రూ.32 లక్షల 90 వేల 502 ఆదాయం లభించింది. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. 75 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకులు, మొక్కుబడులను పొన్నూరు ఈవో శ్రీనివాస్ సమక్షంలో లెక్కింపు జరిపారు. 81 1/2 గ్రాముల బంగారం, 1.575 కిలోగ్రాముల వెండి కానుకల రూపంలో భక్తులు సమర్పించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కంభం సాయిబాబు, సభ్యులు, బ్యాంకు సిబ్బంది, స్కౌట్స్ కార్యకర్తలు, ఈవో అనుపమ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


ఆహారం పంపిణీ చేస్తున్న యోగా కేంద్రం సభ్యులు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో బుధవారం ఎస్‌వీ యోగా సభ్యులు కన్నెగంటి వెంకట నందకిషోర్ 47వ పుట్టిన రోజు సందర్భంగా తల్లితండ్రులు కన్నెగంటి పిచ్చయ్య, సుశీలదేవి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లని పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు చాందన, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయ వంటల్ని డిజిటలైజ్ చేయాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణప్రసాద్

గుంటూరు విద్య అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ఇంట్లో అమ్మమ్మలు సంప్రదాయ వంటలు ఎలా తయారు చేస్తారో తెలుసుకుని ఆ విధానాన్ని డిజిటలైజ్ చేయాలని తెనాలి డబుల్ హార్స్ గ్రూపు జీఎం ఎన్వీ కృష్ణప్రసాద్ పొలిశెట్టి సూచించారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్, ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రొటీన్ కలిగిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 70 సంవత్సరాలు పైబడిన మహిళల్ని సంప్రదించామని వారు భిన్న రకాలైన వంటల్ని, వాటి తయారీ విధానం తెలియజేశారని తెలిపారు. ఇప్పటి తరం వారికి కొన్ని వంటల గురించి తెలియకపోవడం శోచనీయమని అన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలంటే తగిన వ్యాయామం, ఆహారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుతులు అందజేశారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.నాగభూషణ్, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

షేక్ యాసిన్‌కు ఘన నివాళి

పొన్నూరుటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): షేక్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ యాసిన్ 73వ జయంతి వేడుకలు బుధవారం పట్టణంలో జరిగాయి. ఐలాండ్ సెంటర్‌లోని యాసిన్ విగ్రహానికి పూలమాలలు వేసి అభిమానులు నివాళులర్పించారు. అనంతరం నిడుబ్రోలు శాంథోమ్ కరుణానిలయంలో అన్నదానం చేసారు. కార్యక్రమంలో యాసిన్ కుమారుడు మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పొన్నూరు బ్రాంచి వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... లేటు కూరపాటి లాజర్ గారి కుమారుడు కూరపాటి గోపి గారి ఆస్థిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు కూరపాటి గోపి గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : బాపట్ల జిల్లా, మంతెనవారిపాలెం సబ్.డి, యిలాకా నిజాంపట్నం మండలం, నిజాంపట్నం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన నిజాంపట్నం గ్రామ డి.నెం. 405-2ఎ2కు దాఖలా డోరు నెం. 21-134 కు సమీపమున ఈ రోజున సీక నేసు దఖలు పరచిన చ.గ.145.2లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు : ఆర్ & బి రోడ్డు హద్దు, దక్షిణం : కూరపాటి పుష్ప (నా సిల్వా) స్థలము హద్దు, పడమర : కర్లపూడి సుజ్ఞానం గారి స్థలము హద్దు, ఉత్తరం : పంచాయితీ సి.సి. రోడ్డు హద్దు. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 145.2లు గల మెరక ఖాళీ నివేశన స్థలము మాత్రం. ఈ ఆస్తి కి సంబంధించిన DOC No: 6123/2024, SRO. భట్టిప్రోలు

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

తూములూరులో స్తంభించిన మురుగు నీరు

● విజృంభిస్తున్న దోమలు ● పట్టించుకోని అధికారులు

కొల్లిపర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పూడుకుపోయిన కాల్వలు.. ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన మురుగు.. కాలు బయట పెట్టలేని పరిస్థితి.. భరించలేని దుర్గంధం.. విజృంభిస్తున్న దోమలు. ఇవీ మండల పరిధిలోని తూములూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో ప్రజల కష్టాలు. ఎప్పుడు వర్షాలు పడిన ఎక్కడి నీరు అక్కడ స్తంభించిపోవడం పరిపాటిగా మారింది. వర్షాలు పడటం తగ్గినప్పటికి నీరు ఏ మాత్రం కదలకపోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాప్‌ల చుట్టూ, సిమెంట్ రోడ్లపై నీరు నిలబడటంతో ఎప్పుడు అంటు వ్యాధులు ప్రబలుతాయోమోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో మార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ పరిస్థితి గురించి కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారే తప్ప సమస్య మాత్రం పరిష్కరం కావటంలేదు. వర్షాలు పడినప్పుడు అధికారులు మాత్రం నామమాత్రంగా కాల్వలు తవ్విస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కరం కావటం లేదు. కాలనీల్లో లక్షలాది రూపాయలతో సిమెంటురోడ్డును నిర్మాణం చేపట్టారు. సిమెంటు రోడ్లకు ఇరుప్రక్కల డ్రెయినేజి ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడి నీరు అక్కడ స్తంభించిపోయింది. గృహల చుట్టూ నీరు చేరుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని తూములూరు ఎస్సీ, బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.


తూములూరులో వర్షపు నీటిలో పూర్తిగా మునిగి పోయిన సిమెంట్ రోడ్డు


సిమెంట్ రోడ్డుపై పారుదల అవుతున్న మురుగునీరు